కొనసాగుతున్న టీచర్ల కౌన్సెలింగ్

- నగర పరిసర మండలాల్లో ఎస్జీటీ ఖాళీలు భర్తీ

6లో



తల్లుల్లో ఆనందోత్సాహాలు

బ్యాంకు ఖాతాల్లోకి 'తల్లికి వందనం' డబ్బులు జమ

కుటుంబంలో చదువుకునే పిల్లలందరికీ పథకం వర్తింపు

ముగ్గురు పిల్లలుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, ఐదుగురైతే రూ.65 వేలు..

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం డబ్బులు గురువారం సాయంత్రం నుంచే తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకూ, ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ నగదు జమ అవుతున్నది. దీంతో తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- ఖాతాల్లో డబ్బులు పడినట్టు మెసేజ్‌లు రావడంతో ఉబ్బితబ్బిబ్బు
- మిగిలిన రూ.2 వేలు పాఠశాలల నిర్వహణకు కలెక్టర్ ఖాతాలో జమ
- జాబితాల్లో పేర్లు లేని అర్హులకు మరోసారి అవకాశం
- జిల్లాలో 1,90,433 మంది అర్హులు, సుమారు రూ.245 కోట్లు చెల్లింపు
- ఒకటి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు త్వరలో సొమ్ములు

నిరుపేద కుటుంబాల్లో పిల్లల చదువును ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతి బిడ్డకు ఏటా రూ.15 వేల చొప్పున సాయం అందిస్తామని గత ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రకటించడమే కాకుండా 'సూపర్ సిక్స్'లో చేర్చిన విషయం తెలిసిందే. ఇచ్చిన హామీని ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్టు ప్రభుత్వం గతంలోనే వెల్లడించింది. ఈ పథకం పేరును 'తల్లికి వందనం' అని ప్రకటించింది. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో ఈ పథకానికి అర్హులైన వారి జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించారు. ఇదే రోజున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాలో 1,90,433 మంది విద్యార్థులకు సంబంధించి 1,30,706 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.245 కోట్లు ... మిగతా 6వ పేజీలో

ముగ్గురు పిల్లలకు....



సాగర్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధిలోని సాగర్‌నగర్ సమీపాన గల తాటిచెట్లపాలెం గ్రామానికి చెందిన చింతాడ రాజు, సంతోషకుమారి దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె రాజశ్రీ ఎనిమిదో తరగతి, మిగిలిన ఇద్దరు మోహన్‌రావు, లావణ్య ఐదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ముగ్గురు పిల్లలకు కలిపి రూ.39 వేలు శుక్రవారం సంతోషకుమారి ఖాతాలో పడ్డాయి. దీంతో ఆ దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లల చదువుకు భరోసా లభించింది

- పితాని లీల, పినగాడి, విశాఖపట్నం జిల్లా



పెందుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం పినగాడికి చెందిన పితాని కుమారస్వామి, లీల దంపతులకు ముగ్గురు పిల్లలు. దివ్య ఏడో తరగతి, కోమలి ఆరో తరగతి, తేజ ఒకటో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద పిల్లల ముగ్గురికీ కలిపి రూ.39 వేలు లీల బ్యాంకు ఖాతాలో శుక్రవారం జమ అయ్యింది. దీంతో తమ పిల్లల చదువుకు ఆర్థికంగా భరోసా లభించిందని తల్లి లీల ఆనందం వ్యక్తం చేసింది. కుమారస్వామి వ్యవసాయ కూలీ.

ఒకే కుటుంబంలో ముగ్గురికి...



అక్కయ్యపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంకరమఠం ప్రాంతంలో నివాసం ఉంటున్న రెడ్డి రమణ, వరలక్ష్మి దంపతులకు ముగ్గురు పిల్లలు. కుమారుడు రాజు బీవీకే కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కుమార్తె స్వీటీ లలితానగర్‌లోని జ్ఞానానికేతన్ పాఠశాలలో తొమ్మిదో తరగతి, చిన్న కుమార్తె ప్రహాసిని రెండో తరగతి చదువుతున్నారు. ముగ్గురు పిల్లలకు రూ.13 వేలు చొప్పున మొత్తం రూ.39 వేలు వరలక్ష్మి బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది.

త్రిశంకు స్వర్గంలో భాషోపాధ్యాయులు

వైసీపీ హయాంలో కేడర్ రద్దుతో ఇబ్బందులు

- అప్పటి నుంచీ డీఈవో పూల్‌లో కొనసాగింపు
- ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు పంపుతున్న విద్యా శాఖ
- ఆరేళ్లలో నాలుగుసార్లు బదిలీ
- తాజాగా ఏజెన్సీ మండలాల్లో పోస్టింగ్
- జడ్పీ ప్రాంగణంలో ఆందోళన



జడ్పీ ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న భాషోపాధ్యాయులు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు అత్యుత్సాహంతో భాషోపాధ్యాయ (లాంగ్వేజ్ పండిట్లు) కేడర్‌ను రద్దు చేయడంతో వారంతా ఆరేళ్ల నుంచి త్రిశంకుస్వర్గంలో ఉండిపోయారు. ప్రస్తుతం మిగులు ఉపాధ్యాయులుగా డీఈవో పూల్‌లో ఉన్న వారిని విద్యా శాఖ ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు పంపిస్తోంది. ఏదైనా ఒక పాఠశాలలో టీచర్ దీర్ఘకాలిక సెలవుపై లేదా పదోన్నతిపై వెళ్లిపోతే ఆ స్థానంలో తాత్కాలికంగా పనిచేయాలని ఆదేశాలు ఇస్తోంది.

2008లో మెగా డీఎస్సీ ద్వారా తెలుగు, హిందీ, ఒరియా, ఉర్దూ, కన్నడ, తమిళం, సంస్కృత భాషల కోసం ఎంపికైన భాషోపాధ్యాయుల్లో కొందరికి తరువాత గ్రేడ్-1 పండిట్లుగా పదోన్నతి లభించింది. అయితే 2019 నవంబరులో వైసీపీ ప్రభుత్వం జీవో నంబరు 77 ద్వారా భాషాపోధ్యాయ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పదోన్నతి లభించని 66 మంది డీఈవో పూల్‌లోకి వెళ్లిపోయారు. కేడర్ రద్దు చేసినప్పుడు ఆ పోస్టులో ఉన్నవారందరికీ పదోన్నతి కల్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో గడచిన ఆరేళ్లలో భాషోపాధ్యాయులు నాలుగు సార్లు బదిలీలకు గురయ్యారు. నిబంధనల మేరకు ఒక టీచర్ ఒకే స్కూలులో ఎనిమిదేళ్లు పనిచేయవచ్చు. దానికి భిన్నంగా పండిట్లను ఎప్పుడు పడితే అప్పుడు బదిలీ చేయడం పరిపాటిగా మారింది. ఇటువంటి పరిస్థితులతో విసుగు చెందిన భాషోపాధ్యాయులు తమకు న్యాయం చేయాలంటూ 2024లో కోర్టును ఆశ్రయించారు. అర్హతల మేరకు మూడు నెలల్లో పదోన్నతులు కల్పించాలని కోర్టు ఆదేశించినా ఖాళీలు లేవని విద్యా శాఖ వాయిదా వేస్తూ వచ్చింది. ఈలోగా సీనియారిటీ మేరకు భాషోపాధ్యాయులుగా తమకు కూడా పదోన్నతులు కల్పించాలని ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించారు. దీంతో యథాస్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశించింది.

భాషోపాధ్యాయుల ఆందోళన

భాషోపాధ్యాయుల బదిలీల కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చినా ఎవరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేదు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో డీఈవో పూల్‌లో ఉన్న 66 మంది భాషోపాధ్యాయులలో ... మిగతా 6వ పేజీలో

ఏయూ సెక్యూరిటీ సూపర్‌వైజర్

వికృతచేష్టలు

- మైదానంలో వాకింగ్‌కు వెళ్లే మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన
- నిబంధనల పేరుతో మాటలు కలుపుతూ తాకేందుకు యత్నం
- భయభ్రాంతులకు గురవుతున్న మహిళలు
- ఆరోపణలు ఉన్నా పట్టించుకోని అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్న బాధితులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



ఆంధ్ర విశ్వవిద్యాలయం సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న కొందరి వ్యవహారశైలి వివాదాస్పదమవుతుతోంది. ఇంజనీరింగ్ మైదానం పరిసరాల్లో గంజాయి బ్యాచ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి అడ్డుకట్ట వేయాల్సిన సిబ్బంది ఆ బాధ్యతను విస్మరించి...సాయంత్రం పూట వాకింగ్‌కు వెళ్లే మహిళలను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏయూలో భద్రత కోసం ప్రత్యేకంగా సెక్యూరిటీ విభాగం ఏర్పాటుచేశారు. సెక్యూరిటీ డీన్ పర్యవేక్షణలో ఆరుగురు సూపర్‌వైజర్లు, మరో 60 మంది వరకూ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సెక్యూరిటీ చీఫ్‌గా విశ్రాంత పోలీస్ అధికారి మహ్మద్‌ఖాన్‌తోపాటు ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు మరో 20 మంది సిబ్బంది గత వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి హయాంలో నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఏయూ అధికారులు సెక్యూరిటీ చీఫ్ ఖాన్‌ను ఉద్యోగం నుంచి తొలగించినా మిగిలినవారి జోలికి వెళ్లకుండా వదిలేశారు. సెక్యూరిటీ చీఫ్‌ను తొలగించిన తర్వాత ఆ పోస్టులో కొత్తవారిని నియమించకపోవడంతో ప్రసాదరెడ్డి ప్రియశిష్యుడిగా గుర్తింపుపొందిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఒకరు తానే సెక్యూరిటీ చీఫ్ అన్నట్టు హడావిడి చేయడం ప్రారంభించారు. సదరు సూపర్‌వైజర్ తనకు కేటాయించిన చోట కాకుండా ఏయూ మొత్తం, మిగిలిన మైదానాలు, హాస్టళ్ల వద్ద కూడా భద్రతాపరమైన పర్యవేక్షణ పేరుతో తిరుగుతుంటారు.

ఇదిలావుండగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంతోపాటు అవుట్ గేట్ సమీపంలో ఉన్న ప్లాటినం జూబ్లీ మైదానంలో ప్రతీరోజూ ఉదయం, సాయంత్రంవేళ వందలాది మంది నగరవాసులు వాకింగ్ చేస్తుంటారు. సెక్యూరిటీ చీఫ్ మాదిరిగా హడావిడి చేసే సదరు సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఏయూ మైదానంలో వాకింగ్ చేసే మహిళలను వేధింపులకు గురిచేస్తున్నట్టు కొద్దిరోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా సాయంత్రం వేళ ఒంటరిగా వాకింగ్ చేసే మహిళల వెనుక వెళ్లి 'అటువైపు వాకింగ్ చేయకూడదు. ఆ ప్రాంతంలో మాత్రమే వాకింగ్ చేయాలి' అంటూ నిబంధనల పేరుతో వారితో మాటలు కలుపుతున్నాడని, ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే...ఏయూ సెక్యూరిటీ ఇన్‌చార్జిని తానేనని, తాను అభ్యంతరం చెబితే వాకింగ్ చేయడానికి వీలుండదని బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు. ఎవరైనా భయంతో నెమ్మదిగా మాట్లాడితే 'అటువైపు వెళ్లండి' అంటూ చేతితో తాకుతుంటాడంటున్నారు. ఇలాంటి వేధింపులకు గురైన ఒక మహిళ తన భర్త ద్వారా ఈ విషయాన్ని ఏయూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సదరు సూపర్‌వైజర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదంటున్నారు. ఏయూ అధికారులు తక్షణం దీనిపై దృష్టిసారించి మహిళలను వేధింపులకు గురిచేస్తున్న సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబసభ్యులు చెబుతున్నారు.

అనుమానాలు అనేకం

- ఘటన నేపథ్యంపై 'సాయి శ్రేయాస్' ఫార్మా గోప్యత
- నోరు మెదపని 'ఫ్యాక్టరీస్' అధికారులు
- డ్యూటీ నుంచి ఇంటికి వెళ్లిపోయిన సేఫ్టీ విభాగం అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్‌ను తిరిగి రప్పించిన యాజమాన్యం
- వెళ్లిన కొద్దిసేపటికే మృతి...



మృతి చెందిన చంద్రశేఖర్



'సాయి శ్రేయాస్' ఫార్మా

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిజిల్లా పరవాడ రాంకీ ఫార్మా సిటీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత సాయి శ్రేయాస్ కంపెనీలో విషవాయువులు పీల్చి ఇద్దరు సేఫ్టీ అధికారులు చనిపోయిన ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యం ఉద్యోగుల పట్ల కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదని, ఎవరైనా పని గంటలు, హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని వెంటనే ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

- విచారణ జరిపించాలని భార్య డిమాండ్
- కంపెనీలో ఉద్యోగులకు వేధింపులు
- సేఫ్టీ అధికారులకు ఇతర బాధ్యతలు

ఇంటికి వెళ్లిపోయిన వారిని రప్పించారు

సాయి శ్రేయాస్ సేఫ్టీ విభాగంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న పి.చంద్రశేఖర్ బుధవారం డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో కంపెనీ నుంచి రమేశ్ అనే వ్యక్తి ఫోన్ చేసి, ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ చేయాలి రమ్మని ఆదేశించడంతో పది గంటలకు ఆయన బయలుదేరి వెళ్లినట్టు భార్య కుసుమ చెబుతున్నారు. అలా వెళ్లినప్పుడు ఆ పని చూసుకొని ఒకటి, రెండు గంటల్లో వచ్చేస్తారని, ఆ రోజు ఇంకా రాకపోయేసరికి తాను 12 గంటలకు ఫోన్ చేశానని, ఆయన ఫోన్ ఎత్తలేదన్నారు. ఒకవేళ మీటింగ్‌లో ఉండి మాట్లాడలేని పరిస్థితి ఏదైనా ఉంటే...ఆ వాయిస్ వినిపించేవారని, ఆ రోజు ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి ఆయన కొలీగ్ నంబర్‌కు ఫోన్ చేయగా, ఒక్క రింగ్‌కే లిఫ్ట్ చేసి ప్రమాదం జరిగిందని చెప్పారన్నారు. కిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళుతున్నారని చెప్పారని, ఆ తరువాత ఆరా తీస్తే అసలు కంపెనీలోనే ఆయన చనిపోయారని తెలిసిందన్నారు.

యాజమాన్య ప్రతినిధులు తన భర్తతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, ఆయన అసిస్టెంట్ మేనేజర్ అయినప్పటికీ ... మిగతా 6వ పేజీలో



డెయిరీ కాంట్రాక్టు కార్మికుల నుద్దేశించి ప్రసంగిస్తున్న సిహెచ్ నర్సింగరావు

విశాఖ డెయిరీలో 400 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

- గేటు ఎదుట ఆందోళనలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ యాజమాన్యం సుమారు 400 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించింది. దీంతో వారంతా శుక్రవారం డెయిరీ ఎదుట ఆందోళన చేపట్టారు. కార్మిక సంఘంతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని గత కొన్ని రోజులుగా డెయిరీ యాజమాన్యాన్ని కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సుమారు 400 మంది కాంట్రాక్టు కార్మికులు విధులకు హాజరయ్యేందుకు రాగా వారిని కర్మాగారంలోకి అనుమతించలేదు. దీంతో కార్మికులు మెయిన్ గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. వారికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు సీహెచ్ నరసింగరావుతో పాటు పలువురు సీపీఎం నాయకులు మద్దతు ... మిగతా 6వ పేజీలో

క్షణికావేశంలో దారుణం



హతురాలు వెంకటలక్ష్మి (ఫైల్)

- భార్యను డంబెల్‌తో కొట్టి హతమార్చి, అనంతరం తానూ ఆత్మహత్య
- అనాథలుగా ఇద్దరు పిల్లలు

కంచరపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధిలోని రెడ్డికంచరపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున దారుణం చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో పాటు తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందనే కోపంతో డంబెల్‌తో దాడి చేసి హతమార్చిన భర్త..అనంతరం తాను కూడా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డికంచరపాలెం వివేకానంద వీధిలో నివాస ఉంటున్న నందిగామ గోపీనాథ్ (42) పెయింటింగ్ పనులు చేసేవాడు. అతనికి భార్య వెంకటలక్ష్మి (37), కుమారుడు జశ్వంత్ రీతు (14), కుమార్తె లక్ష్మీప్రియ (10) ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భర్త వేధింపులు భరించలేక వెంకటలక్ష్మి కుమార్తెతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల తిరిగి భర్త వద్దకు వచ్చింది. అయితే వచ్చినప్పటి నుంచి భార్యను గోపీనాథ్ అనుమానంతో వేధిస్తుండేవాడు. ఆ వేధింపులు తట్టుకోలేక వెంకటలక్ష్మి ఈమధ్య కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని గోపీనాథ్ ఒత్తిడి తెచ్చేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో ఆవేశంతో ఊగిపోతూ ఇంట్లో ఉన్న డంబెల్‌తో కొట్టి వెంకటలక్ష్మిని గోపీనాథ్ హతమార్చాడు. ఆ తరువాత తాను వేరొక గదిలోకి వెళ్లి గడియ పెట్టి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల మధ్య గొడవ సమయంలో అడ్డుకోవడానికి ఇద్దరు పిల్లలు యత్నించగా ... మిగతా 6వ పేజీలో

వేటకు వేళాయె

నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలోకి బోట్లు

- హార్బర్ కేంద్రంగా 650 మరబోట్లు
- రొయ్యల కంటే చేపలతోనే గిట్టుబాటు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్రంలో చేపల వేట శనివారం అర్ధరాత్రి నుంచి మొదలు కానుంది. కేంద్ర ప్రభుత్వం విధించిన రెండు నెలల నిషేధం ముగియనుండడంతో మత్స్యకారులు వేటకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హార్బర్‌ను కేంద్రంగా చేసుకొని సుమారు 650 మరబోట్లు ఉండగా, వాటిలో సగం కంటే తక్కువే వేటకు వెళ్లనున్నాయి. డీజిల్, ఐస్, బోట్ల విడి భాగాల ధరలు బాగా పెరగడం, గిట్టుబాటు అయ్యేలా వేట లేకపోవడం వల్ల చాలామంది బోట్లను జెట్టీలకే పరిమితం చేస్తున్నారు. ఇంతకుముందు కొందరు మత్స్యకారులు ... మిగతా 6వ పేజీలో

పంపిణీకి విత్తనాలు సిద్ధం

భీమునిపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భీమిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సాగు కోసం రాయితీపై పంపిణీ చేసేందుకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ తెలిపారు. పద్మనాభం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ నెల 15న విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఎకరాకు 30 కిలోల చొప్పున వరి విత్తనాలు అందజేస్తామన్నారు. రాయితీపై 30 కిలోల వరి విత్తనాలు రూ.150కు పంపిణీ చేస్తామన్నారు. విత్తన ప్యాకెట్‌తో పాటు 250 గ్రాముల సూడోమోనాస్ విత్తన శుద్ధి మందును కూడా 50 శాతం రాయితీపై రూ.38కు అందిస్తామని ఆయన చెప్పారు.

భీమిలి అదనపు సీడీపీవోగా సంతోషికుమారి

భీమునిపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు అడిషినల్ సీడీపీవోగా సిహెచ్.సంతోషికుమారి శుక్రవారం నియమితులయ్యారు. అనంతగిరి ప్రాజెక్టులో పనిచేస్తూ ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుగా పనిచేసిన జె.రేఖావాణి, కె.ప్రమీల, వి.వి.రత్నం బదిలీ అయ్యారు. ఇక్కడికి సూపర్‌వైజర్లుగా జి.శిరీష, కె.సుస్మిత, బి.నాగమణి, ఎంవీ.పార్వతి, జియా ఉన్నీసా బేగం నియమితులయ్యారని సీడీపీవో తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ఆనందపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గొట్టిపల్లి కళ్లాకు చెందిన వివాహిత అదృశ్యమైనట్టు శుక్రవారం ఫిర్యాదు అందిందని సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. గురువారం తన మామతో కలసి ఆనందపురంలో ఉన్న బ్యాంక్‌కు వివాహిత వచ్చారని, మావయ్యను రోడ్డుపై ఉంచి టైలర్ దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి అతని ఫోన్‌ను తీసుకుని వెళ్లిందని చెప్పారు. అనంతరం ఆమె భర్తకు ఫోన్ చేసి టైలర్‌కు డబ్బులు ఇవ్వాలని ఫోన్ పే చేయమని చెప్పిందని, అప్పటి నుంచి కనిపించలేదని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేసినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

పద్మనాభం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేపడుతున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జె.సురేశ్ తెలిపారు. బర్లపేట గ్రామానికి చెందిన ఆవాల రాము అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడి చేసి పట్టుకోగా, అతని వద్ద ఎనిమిది మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.


యోగాంధ్ర విజయవంతానికి సహకరించాలి

భీమునిపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు కోరారు. శుక్రవారం ఉదయం జమ్మిచెరువు ఉద్యానవనంలో జేసీ వాకర్స్ క్లబ్ సభ్యులను ఆయన కలిశారు. ఆసక్తి కలిగిన వారు వార్డు సచివాలయాలలో పేర్లు నమోదు చేసుకోవాలని, వారికి శిక్షణ అందిస్తారని వివరించారు.

ఆర్‌వీ పురం పాఠశాలలో విద్యా కానుక కిట్ల పంపిణీ

పద్మనాభం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ కె.రాంబాబు శుక్రవారం విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. 275 మంది విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శంకరరావు, సర్పంచ్ కె.రమణ, ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గంగరాజు, టీడీపీ నాయకుడు అప్పలనాయుడు, పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకారం



ఈడీ శంకరరావు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జె.శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాజాగా నిర్వహించిన బదిలీల్లో కృష్ణా జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు ఉద్యోగులు అభినందించారు. కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తానని ఆయన అన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీగా కవిత



బాధ్యతలు స్వీకరిస్తున్న కవిత

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీగా కె.కవిత నియమితులయ్యారు. శ్రీకాకుళం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన ఆమె విశాఖకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఏడీగా పనిచేసిన మాధవి టూరిజం అధికారిగా బదిలీ అయ్యారు. బదిలీపై వచ్చిన కవిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

అసంపూర్తి పనులకు మోక్షమెన్నడో..?

- బీచ్ రోడ్డులో పూర్తికాని గ్రానైట్ పనులు
- పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులు





బీచ్ పార్కులో అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రానైట్ పనులు

భీమునిపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. రెండేళ్ల క్రితం క్రితం చేపట్టిన ఈ పనులను పట్టించుకునే నాథులే కరువయ్యారు.

జి-20 సదస్సు నేపథ్యంలో భీమిలి బీచ్ సుందరీకరణ కోసం కొన్ని పనులను జీవీఎంసీ అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా బీచ్ రోడ్‌లోని గాంధీ పార్క్, బీచ్ పార్క్‌లలో గ్రానైట్ పనులు ప్రారంభించారు. రెండేళ్ల క్రితం చేపట్టిన ఈ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ పార్క్‌లలో పాత్ వే సపోర్టు వాల్స్‌లోను, పార్క్ ప్రహరీలపైన గ్రానైట్ స్టోన్‌తో అందంగా తీర్చిదిద్దాల్సి ఉండగా, అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ విషయమై ప్రస్తుత ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించగా, అసలు తమకు తెలియదన్నట్టు మాట్లాడుతున్నారు. అప్పట్లో ఈ పనులు చేసిన అధికారులకు తెలుస్తుందని, తమ దృష్టిలో లేదని సమాధానం ఇస్తున్నారు. మరి ఈ పనులు పూర్తయ్యే మార్గం ఏమైనా ఉందా? అని నగర ప్రజలు సందేహపడుతున్నారు. అధికారులు పర్యవేక్షణ లోపం, చిత్తశుద్ధి లేకపోవడం వెరసి అభివృద్ధి పనులు ఇలా అసంపూర్తిగా మిగిలిపోయాయని, ఫలితంగా ప్రజా ధనం దుర్వినియోగమవుతున్నదని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి



మండల స్థాయి అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పద్మనాభం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఎన్‌హెచ్-16 భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ కె.జ్ఞానవేణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటున్న నేపథ్యంలో మండలం నుంచి 140 బస్సుల్లో యోగా నిర్వహించే కేంద్రాలకు ప్రజలను తీసుకువెళ్లడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 16 సచివాలయాల నుంచి యోగా దినోత్సవంలో పాల్గొనేలా వ్యవసాయాధికారి, డిప్యూటీ ఎంపీడీవోలు, నోడల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఏడు వేల మందితో శనివారం నిర్వహించే మాక్ యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం.విజయకుమార్, తహసీల్దార్ కె.ఆనందరావు, ఏఓలు ఎంవీఎస్.చలం, జయ ఉమ, డిప్యూటీ ఎంపీడీవో మీనాకుమారి, ఎస్ఐ సురేశ్, డీటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లుల్లో ఆనందం చూస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న గంటా నూకరాజు

భీమునిపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుతో విద్యార్థుల తల్లుల్లో ఆనందం చూస్తున్నామని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు దారుణంగా తయారైనా సూపర్ సిక్స్ హామీలను అమలుచేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తగిన చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా ఒక బిడ్డ వున్న తల్లులు 18,55,760 మందికి, ఇద్దరు బిడ్డలున్న తల్లులు 1455,322 మందికి, ముగ్గురు పిల్లలున్న తల్లులు 2,10,684 మందికి, నలుగురు పిల్లలున్న తల్లులు 20,053 మందికి ఈ పథకం వర్తించిందన్నారు. ఒక్కొక్క బిడ్డకు రూ.15 వేల చొప్పున అందించినట్టు చెప్పారు. దీంతో ఆయా బిడ్డల తల్లులు ఎంతో ఆనందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.రమణ, కె.నాగరాజు, ఎం.సంజీవకుమార్, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరంగా అప్పన్న నిత్య కల్యాణోత్సవం





కల్యాణం చేస్తున్న అర్చకులు... పాల్గొన్న భక్తులు

సింహాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సింహాచలం నారసింహుని ఆర్జిత నిత్య కల్యాణోత్సవం నయనమనోహరంగా సాగింది. ఇందులో భాగంగా శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ఆభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్ర విధానంలో కంకణధారణలు చేసి నూతన యజ్ఞోపవీత సమర్పణలుగావించారు. వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు చేసి అక్షితారోపణం జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలు ఇచ్చాక భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



హైకోర్టు న్యాయమూర్తి, పుదుచ్చేరి మంత్రికి ఫొటోలు ఇస్తున్న ఏఈఓ, డిప్యూటీ ఈఓ

సింహాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎ.హరిహరనాథశర్మ, పాండిచ్చేరి ప్రభుత్వ విద్యుత్ శాఖ మంత్రి ఎ.నమశ్శివాయం శుక్రవారం దర్శించుకున్నారు. ప్రముఖులకు దేవస్థానం ఏఈఓ రమణమూర్తి, డిప్యూటీ ఈఓ సింగం రాధ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న అనంతరం, వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు స్వస్తి వచనాలతో వేదాశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం వారిని అధికారులు శాలువాలతో సత్కరించి స్వామివారి ఫొటోలను, ప్రసాదాలను అందజేశారు.

త్రికరణ శుద్ధితో సేవలు అందించాలి: ఏఈవో

సింహాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): త్రికరణ శుద్ధితో సేవలు అందించాలని సింహాచల దేవస్థానం సహాయ కార్య నిర్వాహణాధికారి నక్క ఆనందకుమార్ సూచించారు. సేవా సంస్థల కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవ చేసే ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింహాద్రి అప్పన్న ఆలయ పరిధిలో పలువురు సేవలు అందిస్తుండగా వారిలో కొందరు అంతరాలయంలో మాత్రమే సేవలు చేస్తామని అనటం సరికాదన్నారు. దేవస్థానానికి చెందిన నిత్యాన్న ప్రసాదం, రవాణా, మరేతర విభాగాల్లోనైనా సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కొందరు సేవా కార్యకర్తలు మాట్లాడుతూ దేవాలయ సిబ్బంది తమను వస్త్రధారణ, వ్యక్తిగత విషయాలపై హేళన చేసేలా మాట్లాడటం బాధను కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పర్యవేక్షణాధికారి సీవీవీ.పద్మనాభరాజు, ప్రజా సంబంధాల అధికారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ, బంగారమ్మ జాతర



సారెతో ఊరేగింపుగా వెళుతున్న దుర్గమ్మ భక్తులు

కొమ్మాది, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చంద్రంపాలెం దుర్గాలమ్మ, బంగారమ్మ వారాల పండుగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, కోలాటాలు, కర్రసాము, బేతాళ నృత్యాలు, మహిళల తీన్‌మార్‌లతో గ్రామంలో ఊరేగింపును భక్తులు నిర్వహించారు. బంగారమ్మ గుడికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 4 గంటలకు తిరిగి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి దుర్గాలమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కమిటీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఇసకలపాలెం పాఠశాలలో 3, 4, 5 తరగతులు కొనసాగించాలి

పద్మనాభం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసకపాలెం పాఠశాలలో 3, 4, 5 తరగతులను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ మేరకు ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ పాఠశాలను ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కేవలం ఒకటి, రెండు తరగతులతో ఫౌండేషన్ పాఠశాలగా నిర్వహించి, మిగిలిన 3, 4, 5 తరగతుల విద్యార్థులను పద్మనాభంలోని మోడల్ పాఠశాలకు పంపించారని గ్రామస్థులు తెలిపారు. సుమారు కిలోమీటరు దూరం చిన్నారులు బ్యాగుల బరువుతో నడచి రావడం, నిత్యం వివిధ రకాల భారీ వాహనాలు తిరిగే రాష్ట్ర రహదారిని దాటుకొని పాఠశాలకు వెళ్లడం ఆందోళనకు గురి చేస్తున్నదని వాపోయారు. తమ పాఠశాలలోనే ఒకటి నుంచి ఐదు తరగతులను కొనసాగించాలని కోరారు. అనంతరం ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ

భీమునిపట్నం (రూరల్) జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చిప్పాడ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. దివీస్ ఆధ్వర్యంలో 140 మంది విద్యార్థులకు నెల రోజులుగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారికి కంపెనీ జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. కంపెనీ పరిసర ప్రాంతాలలో ఉన్న పంచాయతీలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు, విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందించారు. ఈ శిక్షణ వల్ల కంప్యూటర్‌లో కనీస అవగాహన కలుగుతుందని చెప్పారు. మరో మేనేజరు ఎంఎస్ఎన్ రావు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా విభాగానికి చెందిన డి.సురేష్‌కుమార్, శ్రీనివాస్, శేఖర్‌బాబు, నరసింహారావు, శిరీష పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనారోగ్యం

కొమ్మాది, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మదక ద్రవ్యాల వినియోగంతో అనారోగ్యమని ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ పి.సత్యం చెప్పారు. గ్రీన్‌వ్యాలి ఫౌండేషన్ సభ్యురాలు డాక్టర్ ఉమారాజ్ ఆధ్వర్యంలో బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ మురళీధర్, యూనిట్ వైద్యాధికారులు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లుల్లో ఆనందోత్సాహాలు

... 5వ పేజీ తరువాయి

జమ కానున్నది. గురువారం సాయంత్రం నుంచే తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కావడం మొదలైంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున నిధులు విడుదల చేయగా, వాటిలో రూ.13 వేలు తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తున్నది. ఉదాహరణకు ఇద్దరు పిల్లలు ఉంటే తల్లి బ్యాంకు ఖాతాలో రూ.26 వేలు, ముగ్గురు పిల్లలు ఉంటే రూ.39 వేలు, నలుగురు పిల్లలు ఉంటే రూ.52 వేలు, ఐదుగురు పిల్లలు వుంటే రూ.65 వేలు జమ అవుతున్నాయి. మిగిలిన రూ.2 వేలను పాఠశాలల అభివృద్ధి, నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది.

వైసీపీ ప్రభుత్వంలో కంటే చాలా అధికం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరగా 2023 జూన్ మూడోవారంలో 1,70,476 మందికి రూ.221 కోట్లు జమ చేశారు. ప్రస్తుతం 1,90,433 మందికి రూ.245 కోట్లు జమ కానున్నది. అయితే ఒకటి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరనున్న విద్యార్థులు దీనికి అదనం. అంటే మరో 30 నుంచి 35 వేల మంది వరకూ ఉండవచ్చునని అంచనా. అంటే తల్లికి వందనం సొమ్ములు తీసుకోనున్న విద్యార్థుల సంఖ్య 2.2 లక్షల దాటనున్నది.

1,325 మంది ఖాతాలకు సాంకేతిక సమస్య

జిల్లాలో 1,325 మంది ఎస్సీ విద్యార్థుల తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ చేయడానికి సాంకేతిక సమస్య ఉన్నట్టు అధికారులు గుర్తించారు. తల్లుల ఆధార్ నంబరుకు ఎన్‌పీసీఐ అనుసంధానం కాకపోవడంతో సొమ్ములు జమ కాలేదు. ఈ నేపథ్యంలో 1,325 మంది శనివారం కొత్తగా ఖాతాలు ప్రారంభించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కంచరాన రామారావు తెలిపారు. లేదా తమ ప్రాంతంలోని సచివాలయాలకు వెళ్లి అక్కడ సిబ్బందిని సంప్రతించాలని సూచించారు.

20లోపు సచివాలయాలను సంప్రతించాలి

కాగా బ్యాంకు ఖాతాలు సక్రమంగా నిర్వహించుకోకపోవడం, ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయని కారణంగా అర్హుల జాబితాలో పేర్లు వున్నప్పటికీ ఖాతాలో డబ్బులు జమ కావడం లేదు. ఇటువంటివారు ఈ నెల 20వ తేదీలోగా గ్రామ/వార్డు సచివాలయాల్లో తెలియపరచాలని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా ఈ పథకానికి అర్హులై వుండి, జాబితాల్లో పేరు లేని వారు కూడా సచివాలయాల్లో సంప్రతించాలి. జూన్ 30వ తేదీన తుది జాబితా విడుదల చేసి, మిగిలిన అర్హులకు జూలై 5న నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

నాడు ఒక్కరికే...ఇప్పుడు ఎంతమంది ఉంటే అంతమందికీ...

వైసీపీ అధికారంలో వున్నప్పుడు 'అమ్మ ఒడి' పేరుతో పథకాన్ని అమలు చేసింది. అయితే కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నప్పటికీ ఒక్కరికే సాయం అందించింది. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంతమంది పిల్లలు వుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకం కింద సాయం అందిస్తున్నది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాలు అనేకం

... 5వ పేజీ తరువాయి

సేఫ్టీ పనులు కాకుండా ఎవరైనా కంపెనీకి వస్తే రైల్వేస్టేషన్‌కు, ఎయిర్‌పోర్టుకి వెళ్లి వారిని పికప్ చేసుకొని రావాలని డ్రైవర్ డ్యూటీ చేయిస్తున్నారని కుసుమ ఆరోపించారు. ఇదే అంశంపై తాను భర్తతో ఒకటి, రెండుసార్లు గొడవ పడ్డానని, నువ్వు డ్రైవర్‌వా? అసిస్టెంట్ మేనేజర్‌వా?...అని అడిగానన్నారు. చాలామంది అక్కడి వేధింపులు భరించలేక మానేస్తున్నారని, తన భర్త కూడా మానేయాలని అనుకున్నా...చంటిపిల్ల ఉండడంతో వెంటనే వేరే ఉద్యోగం దొరక్కపోతే ఎలా?...అని ఆలోచించారని పేర్కొంది. యాజమాన్య ప్రతినిధులు ఒకటి, రెండు సార్లు బెదిరిస్తే...తనకు కూడా సర్కిల్ ఉందని ఆయన చెప్పడంతో వారు వెనక్కి తగ్గారని ఆమె తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై తనకు అనుమానాలు ఉన్నాయని, విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

ఘటన నేపథ్యంపై గోప్యత

సాయి శ్రేయాస్‌లో విషవాయువులు అని అధికారులు చెబుతున్నారే తప్ప అది ఏమిటనేది సాంకేతికంగా బయటకు చెప్పడం లేదు. ఒక అధికారి అక్కడ హైడ్రోజన్ సల్ఫైడ్ (హెచ్2ఎస్) విడుదలైందని చెబుతుంటే...దానిని ప్రజాశాస్త్రవేత్తల బృందం ఖండిస్తోంది. ఏ రకమైన రసాయనాలు అక్కడ ఉన్నాయో చెప్పకుండా హెచ్2ఎస్ అని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నిస్తోంది. ఈ ప్రమాద ఘటన క్రమం ఏమిటి?, ఏ రసాయనాల వల్ల జరిగిందనేది కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఫ్యాక్టరీస్ విభాగం పెద్దలు చెప్పడం లేదు. అసలు ఫ్యాక్టరీస్ విభాగం అక్కడ ఏ రకమైన తనిఖీలు చేసిందో కూడా వెల్లడించడం లేదు. ఆ శాఖ అధికారులు కార్యాలయంలో ఉండడం లేదు. ఫోన్లకు స్పందించడం లేదు. నష్టపరిహారం ఇచ్చేశారు కాబట్టి కేసును క్లోజ్ చేయాలని అంతా కలసి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, దాని నిర్వహణపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సి ఉంది.

వేటకు వేళాయె

... 5వ పేజీ తరువాయి

రెండు నుంచి నాలుగు మరబోట్లు సమకూర్చుకొని, వేటకు కూలీలను పంపించేవారు. హార్బర్‌కు తిరిగి వచ్చాక దొరికిన దాంట్లో కొంత పర్సంటేజీతో పాటు చిల్లర చేపలన్నీ వారికి ఇచ్చేవారు. ప్రతి బోటుకు డ్రైవర్‌తో సహా పది మంది వరకు కూలీలు ఉండడంతో వాటాలు పంచేసరికి యజమానికి పెట్టుబడికి తగిన ప్రతిఫలం రావడం లేదు. ఒక వాయేజ్ అంటే రెండు వారాలు సముద్రంలో వేట సాగించడానికి డీజిల్, ఐస్, ఆహారం కోసం సుమారు రూ.4 లక్షల వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. అందరికీ వాటాలు ఇచ్చాక పెట్టుబడి వస్తే చాలనే భావన కలుగుతోంది. దాంతో కొందరు వేటకు దూరంగా ఉంటున్నారు.

తొలి మూడు నెలలు అంటే సెప్టెంబరు వరకూ ఎక్కువగా రొయ్యలే పడతాయి. వీటికి ఇంతకు ముందులా డిమాండ్ లేదు. ఉభయ గోదావరి, నెల్లూరు జిల్లాల్లో వనామీ రొయ్యలను సాగు చేయడం వల్ల అవి తక్కువ రేటుకే లభిస్తున్నాయి. సముద్రపు రొయ్యలకు ఎగుమతిదారులు ఎక్కువ రేటు ఇవ్వడం లేదు. సెప్టెంబరు నెలాఖరు నుంచి చేపలు బాగా దొరుకుతాయి. వాటికి మంచి రేటు, డిమాండ్ కూడా ఉంటోంది. అందుకని చాలామంది బోట్లకు హుక్కులు వేసుకొని చేపల వేటకు వెళుతున్నారు. చాలామంది ఓనర్లు కూలీలతో బోట్లు తిప్పడం లేదు. ఓనర్ కమ్ డ్రైవర్‌గా ఉండేవారు వేటకు వెళితేనే గిట్టుబాటు అవుతోంది. వారే ఇప్పుడు ముందుగా వేటకు వెళుతున్నారు.

త్రిశంకుస్వర్గంలో భాషోపాధ్యాయులు

... 5వ పేజీ తరువాయి

48 మందిని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెంకొత్తవీధి, పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి మండలాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో పోస్టింగ్ ఇస్తామని, మిగిలిన 18 మందిని క్లస్టర్ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం జడ్పీ ప్రాంగణంలో టీచర్ల కౌన్సెలింగ్ జరుగుతున్న హాలు ముందు భాషోపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్లు మాట్లాడుతూ 66 మందిలో 50 మంది వరకూ మహిళలే ఉన్నారని, ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. తమను మైదాన ప్రాంతంలో ఏ మూలైనా యూపీ పాఠశాలలకు పంపాలని డిమాండ్ చేశారు. వారి తరపున ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు వెంకటపతిరాజు, గోపీనాథ్, తదితరులు విశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్, అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడుతో చర్చలు జరిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తిచేశారు.

క్షణికావేశంలో దారుణం

... 5వ పేజీ తరువాయి

వారిని గోపీనాథ్ వేరొక గదిలో పెట్టి తలుపులు వేసినట్టు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భర్త వేధింపులపై వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, గోపీనాథ్‌పై చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని మృతుల కుటుంబీకులు వాపోయారు.

డెయిరీలో 400 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

పలికారు. కార్మికులకు కనీస వేతనాల అమలు, సౌకర్యాలు కల్పించడంతో విఫలమైన యాజమాన్యం...ఇప్పుడు అకారణంగా తొలగించడం సిగ్గుచేటని నరసింగరావు ఆరోపించారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంరాంబాబు, ఎ.లోకేష్, రాజేంద్రప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీచర్ల కౌన్సెలింగ్

నగర పరిసర మండలాల్లో ఎస్జీటీ ఖాళీలు భర్తీ

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ మూడో రోజు శుక్రవారం కొనసాగింది. సీనియారిటీ జాబితాలో 801 నుంచి 1,600 నంబర్ వరకూ గల వారిని కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి 1,200 వరకూ పూర్తిచేశారు. నగరానికి ఆనుకుని ఉన్న చినగదిలి, గోపాలపట్నం, గాజువాక, పెదగంట్యాడ, భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఎస్జీటీ ఖాళీలు పూర్తిగా భర్తీచేశారు. ఇంకా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలంలో మొత్తం ఖాళీలు భర్తీ అయ్యాయి. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్, మూడు జిల్లాల డీఈవోలు ప్రేమ్‌కుమార్, అప్పారావునాయుడు, బ్రహ్మాజీలు కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సీనియారిటీ జాబితాలో 1,601 నుంచి చివర నంబరు అంటే 2,468 వరకూ గల టీచర్లకు బదిలీలు నిర్వహించనున్నారు. శనివారంతో కౌన్సెలింగ్ పూర్తిచేయాలని నిర్ణయించారు.

16న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

286 అంశాలతో అజెండా

సిరిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించేందుకు 286 అంశాలతో అజెండా తయారు చేసి సభ్యులకు అందజేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలు, మార్కెట్లలో ఆశీల వసూలు కోసం నిర్వహించిన వేలం పాట దక్కించుకున్న వారికి వర్క్ ఆర్డర్ ఇచ్చేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం కోసం ప్రతిపాదించారు. వేలం దక్కించుకున్న వారికి ఏప్రిల్ 1 నుంచి వాటిని అప్పగించాల్సి ఉన్నప్పటికీ స్టాండింగ్ కమిటీ అనుమతి లేకపోవడంతో సోమవారం నిర్వహించనున్న సమావేశంలో ఆయా అంశాలను చేర్చారు. ఆయా అంశాలపై సభ్యులు సమగ్ర విచారణ చేపట్టాల్సి ఉంది. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవ నిర్వహణకు పలు పనులను ప్రతిపాదించారు. డీఈలకు కారు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. జీవీఎంసీలో కొందరు అధికారులు తమ అర్హతకు మించిన అద్దె కార్లను వినియోగిస్తుండడంపై సభ్యులు నిలదీయాల్సి ఉంది. ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులుగా అజెండాలో పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ, మధురవాడ ప్రాంతాల్లో రోడ్లు, సామాజిక భవనాలు, కాలువల నిర్మాణాలను అభివృద్ధి పనులకు ప్రతిపాదించారు. జీవీఎంసీలో ప్రతి నాలుగు వార్డుల్లో నీటి సరఫరా పైపులైన్ల నిర్వహణ, లీకుల అరికట్టే పనుల కోసం రూ.10 కోట్లకుపైగా పలు పనులు ప్రతిపాదించారు.

25న డాక్ అదాలత్

ఎంవీపీ కాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25న డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు విశాఖపట్నం డివిజన్ పోస్ట్ ఆఫీసుల సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం పాతనగరం వెలంపేటలోని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ ఆవరణలో ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. వ్యక్తిగత, పోస్టల్ సర్వీసులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించనున్నట్టు తెలిపారు. లిఖిత పూర్వక ఫిర్యాదులు ఈ నెల 23లోగా '12వ డివిజనల్ లెవెల్ డాక్ అదాలత్, గజేంద్ర కుమార్ మీనా, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, విశాఖపట్నం డివిజన్, విశాఖపట్నం 530 001' చిరునామాకు పంపించాలని కోరారు.

ఐక్యూఏసీ సమన్వయకర్తగా డాక్టర్ ఆనందగజపతిరాజు



వెంకోజీపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఐక్యూఏసీ సమన్వయకర్తగా జియో ఫిజిక్స్ విభాగాచార్యులు డాక్టర్ ఆనందగజపతిరాజు పదవీబాధ్యతలను శుక్రవారం చేపట్టారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిజాశంకర్ నుంచి ఆనందగజపతిరాజు బాధ్యతలను స్వీకరించారు.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 18, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 34, బీరకాయలు 26, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 40 దొండకాయలు 18, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 52, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

రోడ్డు విస్తరణ ఆలోచన విరమించుకోవాలి

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌కు పాత వెంకోజీపాలెం నివాసుల వినతి



వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత వెంకోజీపాలెం నివాసులు

వెంకోజీపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డులకు సంబంధించి కొత్త వెంకోజీపాలెం నుంచి సీతమ్మధార వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించే ఆలోచనను విరమించుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం, శ్రీరాధాకృష్ణ సేవా సంఘం సభ్యులతో పాటు రోడ్డు పక్కనున్న నివాసులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో 20 అడుగుల రోడ్డును విస్తరిస్తూ 40 అడుగులు చేశారని, దానిని మరల విస్తరిస్తూ రెండేళ్ల కితం 60 అడుగులు చేశారని, ఇప్పుడు మళ్లీ 80 అడుగులకు విస్తరించాలనే ఆలోచన చేస్తున్నారని చైర్మన్‌కు వివరించారు. దీని వల్ల అనేక మంది నివాసాలను కోల్పోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సొంతఊరిలో గూడును కోల్పోయే దుస్థితి ఏర్పడుతుందని వాపోయారు. రోడ్డు విస్తరణ బదులు రోడ్డును ఆక్రమించి పెడుతున్న భారీ వాహనాలు, దుకాణాలను తొలగించే చర్యలు చేపడితే ట్రాఫిక్‌కు ఎటువంటిఆటంకం కగదని సూచించారు. దీనిపై చైర్మన్ ప్రణవ్‌గోపాల్ స్పందిస్తూ ఈ విషయమై పునరాలోచన చేస్తామని హామీ ఇచ్చారు. నివాసులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షులు కర్రి వెంకటఅప్పారావు, ఉపాధ్యక్షులు పెంటకోట ప్రకాశ్, జనసేన సభ్యులు పీల వెంకట పరదేశినాయుడు, గ్రామ సభ్యులు పీల కోటేశ్వరరావు, పీల పెద్ద, పీల కాశి, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు ఒమ్మి ముత్యాలరాజు, ఒమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో క్షయ నిర్మూలన సాధ్యం

మద్దిలపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి సహకారంతోనే క్షయ నిర్మూలన సాధ్యమవుతుందని 23వ వార్డు వార్పొరేటర్ గుడ్ల విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మద్దిలపాలెం రాయాలయం వద్ద శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీబీ అంటు వ్యాధి అని, ఇది చర్మం నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా సోకే ప్రమాదం ఉందన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల్లో ప్రధానమైన క్షయ ప్రాణాంతకంగా కూడా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధికి చికిత్స, మందులు అందుబాటులో ఉన్నందున నివారణ సులభమన్నారు. అయితే ప్రజలు టీబీపై అప్రమత్తంగా ఉంటేనే ఇదీ సాధ్యమన్నారు. వైద్యురాలు కల్యాణి మాట్లాడుతూ టీబీ లక్షణాలు వివరించి, ఎవరిలోనైనా లక్షణాలు కల్పిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదం అత్యంత విషాదకరం

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు **మృతులకు నివాళి**



విమాన ప్రమాద మృతులకు నివాళి అర్పిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు

సిరిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అహ్మదాబాద్ విమాన ప్రమాదం యావత్తు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విచారం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వైసీపీ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. కొవ్వొత్తులను వెలిగించి మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి ఘోర ప్రమాదం జరగడం ఎంతో బాధకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు వైసీపీ తరపున ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. అదే విమానంలో ప్రయాణిస్తూ మృతి చెందిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రికి విజయభాయి రూపాయిజీకి నివాళులు అర్పిస్తున్నామన్నారు.భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రమాదం ఘటన నుంచి బయట పడ్డ ఒకే ఒక్క వ్యక్తికి పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుభద్ర, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్, దేవన్‌రెడ్డి, మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఒమ్మి సన్యాసిరావు

ఆరిలోవ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలో బీచ్‌రోడ్డులో ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రతి సచివాలయం పరిధి నుంచి 600 మందిని తీసుకువచ్చే బాధ్యత స్థానిక కార్యకర్తలు, నాయకులపై ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు అన్నారు. యోగాడేను విజయవంతం చేసే బాధ్యత అందరిదీ అన్నారు. శుక్రవారం సాయంత్రం తోటగరువులో గల టీడీపీ 12వ వార్డు కార్యాలయంలో ఏర్పాటు యోగా అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య కార్తకర్తలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా టీడీపీ 12వ వార్డు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, పొదుపు సంఘాల ప్రతినిధులకు యోగాడేపై అవగాహన కల్పించారు. నాయకుల నుంచి సచివాలయ సిబ్బందికి తగిన సహకారం ఉంటుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి యోగా ఆవశ్యకతను వివరించి, వారి పేర్లను నమోదు చేయించుకొని, వారు యోగాంధ్రలో పాల్గొనేటట్టు చేయాలని సూచించారు. 12వ వార్డులో మొత్తం ఏడు సచివాలయాలు ఉన్నాయని, ఈ వార్డునుండి సుమారు 4 వేల మందిని యోగాంధ్రలో భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, వార్డు నాయకులు సచివాలయం సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : యోగా మానసిక ప్రశాంతతో పాటు మంచి ఆరోగ్యాన్ని అందిస్తుందని 13 వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ పేర్కొన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, కార్యదర్శి వై.సురేశ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, సచివాలయ సిబ్బంది, టి.బాల స్వామి, బీసీ సెల్ అధ్యక్షుడు ఒడిసెల శ్రీను జన సేన నాయకులు నీలి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆరిలోవ : 13వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా పల్లంరాజు బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న పల్లంరాజు

వెంకోజీపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన ఇంజనీరుగా జీవీ పల్లంరాజు శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. మే 31న జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా ఉన్న పి.శివప్రసాద్ రాజు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లంరాజును పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌బాబు ఆదేశాలు జారీ చేశారు.

జీవీఎంసీ డీడీవోగా ఫణిరామ్‌కు అదనపు బాధ్యతలు



అదనపు బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఫణిరామ్

వెంకోజీపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డీడీవోగా ఎంవీడీ ఫణిరామ్ శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో బాధ్యతలను స్వీకరించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ ఈ నెల 24 వరకు వ్యక్తిగత కారణాలతో ఆర్జిత సెలవులో ఉన్నందున ఆయన నిర్వహిస్తున్న డీడీవో బాధ్యతలను జీవీఎంసీలో డీపీవోగా విధులు నిర్వహిస్తున్న ఎంవీడీ ఫణిరామ్‌ను జీవీఎంసీ డీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) బాధ్యతలను జీవీఎంసీ అదనపు కమిషనర్ (జనరల్) డీవీ రమణమూర్తికి అప్పగించినట్టు ఉత్తర్వులలో ఇన్‌చార్జి కమిషనర్ పేర్కొన్నారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా సింహాచలం



వీసీ నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న సింహాచలం

వెంకోజీపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సమన్వయకర్తగా చిత్రకళా విభాగాధిపతి డి.సింహాచలం నియమితులయ్యారు. శుక్రవారం ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ నుంచి ఆయన నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా సింహాచలంను పలువురు అభినందించారు.

రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్‌గా వల్లీకుమారి



వెంకోజీపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ రీసెర్చ్ డెవలప్ మెంట్ విభాగం డీన్‌గా కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు బి.వల్లీకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య కె.బసవయ్య బాధ్యతలను వల్లీకుమారికి అప్పగించారు. ఈ సందర్భంగా వల్లీకుమారిని విశ్వవిద్యాలయం ఆచార్యులు పలువురు అభినందించారు.

'ఏడాది పాలనలో మహిళలకు మహర్దశ'



22వ వార్డులో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ

మద్దిలపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం అమలు, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డు మాజీ కార్పొరేటర్ నీలిమ ఆధ్వర్యంలో మంగాపురంకాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మహిళలకు మహర్దశ పట్టిందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకం అమలు చేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. చంద్రబాబు విజన్, లోకేష్ నాయకత్వం ఈ రాష్ట్రానికి అవసరమన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు కిలాని అమ్మాజీ, బాబా, సత్యవతి, శ్రీదేవి, లక్ష్మీ, రాధా, పార్వతి పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చదువుకునే పిల్లల కోసం ఎన్నో పథకాలు అందజేస్తున్నారన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్‌లు, షూస్ పంపిణీ చేసిందనానరు. పిల్లలందరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరు రోజూ స్కూలుకు హాజరై చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ సీహెచ్ జ్యోతి, వనిత, జగన్, అరుణ, రమ, టీడీపీ సీనియర్ నాయకులు మళ్ల వెంకట్, సంపంగి సురేష్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్స్ అందజేత



కిట్లు అందజేస్తున్న రామలక్ష్మి

ఆరిలోవ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యా కిట్స్‌ను 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కూలు హెచ్ఎం దుర్గాభవానీ, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, 10వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్ కూటమి నాయకులు పాల్గొన్నారు

ప్రజా పోరాటమే గెలిచింది

మురికివాడల ప్రజలపై కేసులు కొట్టివేతపై ప్రజా సంఘాల హర్షం



సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

సిరిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మురికివాడ ప్రజలు సాగించిన పోరాటం న్యాయమైనదని విశాఖ సెషన్స్ కోర్టు తీర్పు ద్వారా మరోసారి రుజువైందని పలువురు ప్రజా, పౌర సంఘాల ప్రతినిధులు వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, రాజకీయ నాయకులు మురికివాడల ప్రజల హక్కులను గుర్తించాలని డిమాండ్ చేశారు. మురికివాడలలో నివసిస్తున్న ప్రజలందరికీ పట్టా హక్కులు కల్పించాలని, వారి జీవించే హక్కును కాపాడాలని కోరారు. ఇందిరా గాంధీ కాలనీకి ఇప్పటికైనా సంపూర్ణమైన హక్కులు కల్పించాలని కోరారు. 2012 జనవరి 9న జీవీఎంసీ, పోలీసు అధికారులు కలిసి విశాఖలోని మురికివాడలలో నివసిస్తున్న 1200 మందిపై మూడు ఎఫ్ఐఆర్‌ల ద్వారా కేసులు నమోదు చేసి 94 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 13 ఏళ్ల కాలం గడిచిందన్నారు. రైల్వే న్యూకాలనీ శ్రీకన్య థియేటర్ దగ్గర ఇందిరాగాంధీ కాలనీ, జ్ఞానాపురంలో బాబుకాలనీ, దయానందనగర్ చాకలిగెడ్డ రాజీవ్‌కాలనీ, సెబాస్టియన్ కాలనీ, కంచరపాలెం మెట్టు, పైడిమాంబ కాలనీ, మాధవధార ఏకలవ్య కాలనీ, సెంట్రల్ జైలు వద్ద రామకృష్ణాపురం కాలనీ, పెందుర్తి చినముషిడివాడ అంబేద్కర్‌నగర్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ పేకర్ లేఅవుట్‌లోని వినాయక నగర్ కాలనీల ప్రజలను అనేక సెక్షన్ల కింద అరెస్టు చేశారన్నారు. శుక్రవారం ఆ కేసును రెండో జిల్లా సెషన్స్‌కోర్టు, ఒకటో అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు తీర్పు వెలువరిస్తూ కొట్టివేసిందన్నారు. ఈ సమావేశంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ఐపీఎల్ నాయకులు కె.ఎస్.చలం, పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ ఎస్.వెంకటరమణ, సీపీఎం నాయకులు బొట్ట ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను కించపర్చిన వినయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలి

ఏయూ వీసీ రాజశేఖర్‌కు గెస్ట్ లెక్చరర్ల ఫిర్యాదు



వీసీ జీపీ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్సిటీలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులను కించపరిచేలా పత్రికల్లో వ్యాసాలు రాసిన జర్నలిజం విభాగానికి చెందిన వినయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని పలువురు అతిథి అధ్యాపకులు ఏయూ వీసీ జీపీ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం సాయంత్రం వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వినయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వీసీని కలిసి వినయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. వర్సిటీలో కీలకంగా అతిథి అధ్యాపకులు వ్యవహరిస్తున్న తీరును వివరించారు. అతిథి అధ్యాపకులకు కాంట్రాక్ట్ అధ్యాపకుల ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.అర్జునుడు, టీడీపీ కురుపాం నియోజకవర్గం ఇన్‌చార్జి అరేటి మహేష్, బోరుగడ్డ మోహన్ తదితరులు సంఘీభావాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానంపై విమ్స్‌లో అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, వైద్యులు, సిబ్బంది

ఆరిలోవ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడం వల్ల ప్రాణదానం చేసిన వారవుతారని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు. జూన్ 14న అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం నేపథ్యంలో శుక్రవారం విమ్స్ ఆస్పత్రిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని డాక్టర్ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం వల్ల ఎలాంటి హాని జరగదన్నారు. ఒక్క యూనిట్ రక్తంతో ఆపదలో ఉన్న ముగ్గురికి ప్రాణభిక్ష పెట్టే అవకాశం ఉంటుందన్నారు. విమ్స్‌లో గత ఆరు నెలలుగా బ్లడ్ బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటికి ఎనమిది రక్త దాన శిబిరాలు నిర్వహించి, 542 యూనిట్ల రక్తం సేకరించినట్టు చెప్పారు. త్వరలో రక్త హీనతతో బాధపడుతున్న తలసేమియా రోగుల కోసంప్రత్యేక వార్డును విమ్స్‌లో ప్రారంభించనున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా రక్తదానంపై అవఆగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. విమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విమెన్ నెట్‌వర్క్ లీడర్‌షిప్‌పై ఐఐఎంలో అడ్వాన్స్‌మెంట్ సెషన్



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

ఎంవీపీ .కాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విమెన్ నెట్వర్క్ లీడర్‌షిప్‌పై అడ్వాన్స్‌మెంట్ సెషన్‌ను ఐఐఎం కళాశాలలో విజయవంతంగా నిర్వహించారు. ఫ్యూచర్ వర్క్ స్పేస్‌ను సిద్ధం చేయడంలో అకాడెమియా పాత్ర అనే అంశంపై నిర్వహించిన సెషన్‌లో అకాడమిక్ విద్వాంసులు, థాట్ లీడర్లు పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.కృష్ణమోహన్, డీన్ డాక్టర్ ఎస్పీ రవీంద్ర, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.శివకుమార్, అకాడమిక్ అడ్మిన్ మేనేజర్ డాక్టర్ సాయికుమార్, ఐడబ్ల్యుఎన్ లీడ్ మెంటర్ డాక్టర్ టి వసుధ, ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్ డాక్టర్ ఉషా పంతుల హాజరై చర్చించారు. రానున్న రోజుల్లో మహిళా నాయకత్వం, నిర్ణయ సామర్థ్యంపై నిర్వహించిన చర్చలో వార్క్ స్పేస్‌లో డైవర్సిటీపై వక్తలు మాట్లాడారు. భారత దేశాన్ని ప్రపంచంలోనే టాప్ 100 మహిళా నాయకత్వ ప్రేరణ దేశాల జాబితాలోకి చేరేలా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ

సింహాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎ.హరిహరనాథ శర్మ, పాండిచ్చేరి ప్రభుత్వ విద్యుత్ శాఖ మంత్రి ఎ.నమశ్శివాయం శుక్రవారం దర్శించుకున్నారు. ప్రముఖులకు దేవస్థానం ఏఈఓ రమణమూర్తి, డిప్యూటీ ఈఓ సింగం రాధ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న అనంతరం, వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు స్వస్తి వచనాలతో వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామి వారి ఫొటోలను, ప్రసాదాలను అందజేశారు.

బీసీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జె.శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాజాగా నిర్వహించిన బదిలీల్లో కృష్ణా జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు ఉద్యోగులు అభినందించారు. కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తానని ఆయన అన్నారు.



శంకరరావు

వయో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీగా కె కవిత



విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె.కవిత నియమితులయ్యారు. శ్రీకాకుళం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన ఆమె తాజా బదిలీల్లో విశాఖకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు విశాఖ ఏడీగా పనిచేసిన మాధవి టూరిజం అధికారిగా బదిలీ అయ్యారు. బదిలీపై వచ్చిన కవిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

కొవ్వొత్తుల తయారీలో 16న ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక ఆసరా కోసం ఈ నెల 16న కొవ్వొత్తుల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డులోని సిస్టెట్ హాస్టల్ పక్కనున్న బీచ్ స్కూల్ ఆవరణలో శిక్షణ ఇస్తామన్నారు. ఔత్సాహికులు పాల్గొనవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు శిక్షకురాలు రమణికుమారి ఫోన్ 72888 25382ని సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించరూ..



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

జ్ఞానాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం సెక్రెడ్ హార్ట్ హైస్కూల్ వద్ద నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరుతూ 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, ప్రిన్సిపాల్ కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందించారు. విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఎస్సై సమీర్‌ను కోరారు. ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయుడు

అక్కయ్యపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ప్రాంతానికి చెందిన భీమశంకర్ (36)ను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. రెండేళ్ల క్రితం ఆయన తలకు, కాలికి గాయాలై ఆసుపత్రిలో చేరాడన్నారు. ఎనిమిదేళ్ల నుంచి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడేవాడని, ఏడు నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయాడన్నారు. ఏయూటీడీ సిబ్బంది గుర్తించి ఔషధాలు ఇప్పించడంతో కోలుకున్నాడన్నారు. భీమశంకర్‌ను అతని తల్లి, సోదరుడు మేడిశెట్టి ఆదినారాయణకు అప్పగించారన్నారు.

గెడ్డలో చెత్త తొలగింపుతో ముంపు సమస్య పరిష్కారం

- వ్యర్థాలు పేరుకుపోకుండా గ్రిల్స్ ఏర్పాటు
- వంశీనగర్ వాసుల హర్షం



వ్యర్థాలు నిలిచిపోయేందుకు వంశీనగర్ గెడ్డలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

మాధవధార, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) :విశాఖ ఉత్తరంలోని 50వ వార్డు జాతీయ రహదారి పక్కన నివాసిత ప్రాంతం వంశీనగర్ వాసుల గెడ్డ సమస్య తీరింది. వర్షం వస్తే.. కాలనీలోని రోడ్లు, ఇళ్లను ముంచెత్తుతున్న గెడ్డ వద్ద యుద్ధ ప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టారు. గెడ్డలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పూర్తిగా శుభ్రం చేశారు.

మాధవధార కొండ ప్రాంతం నుంచి వంశీనగర్ మీదుగా పారుతూ జాతీయ రహదారి దిగువగా మర్రిపాలెం రైల్వే యార్డు పరిసరాల నుంచి సముద్రంలో కలుస్తున్న ఈ గెడ్డలో చెత్త నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తకుండా ఇనుప కంచె (గ్రిల్స్) అమర్చారు. గెడ్డ అంచు ప్రాంతమంతా ఫెన్సింగ్ రక్షణ కల్పించారు. దిగువ ప్రాంతం మర్రిపాలెం మీదుగా పారేందుకు వీలుగా హైవే దిగువ పైపులైన్ల వద్ద నిర్వహణ పనులు పూర్తి చేశారు.

గత నెలలో ఇక్కడి గెడ్డ ముంపుతో బాధితుల విన్నపం మేరకు విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తక్షణం సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో కాలనీలో పర్యటించి గెడ్డ శుభ్రం చేయించిన తర్వాత నిర్వహణకు వీలుగా చర్యలు చేపట్టారు. ఈ పనులతో రానున్న వర్షాకాలంలో తమకు బెంగ తీరిందని వంశీనగర్ నివాసితులు, సమీప కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దమన్‌జోడి- కిరండూల్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన



ట్రాక్‌ను తనిఖీ చేస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం కేకే లైనులోని దమన్‌జోడి, కిరండూల్ సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సెక్షన్‌లో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులు, ఇతర ట్రాఫిక్ నిర్వహణ కార్యకలాపాలను తనిఖీ చేశారు. అనంతరం దమన్‌జోడి, జగదల్‌పూర్, కిరండూల్ స్టేషన్లలో ప్రయాణికుల మౌలిక సదుపాయాల నిర్వహణ, కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. రైల్వే ఉద్యోగుల కాలనీల్లో పర్యటించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించడతోపాటు నిర్వాసితులతో మాట్లాడి అభివృద్ధి చేయాల్సిన సదుపాయాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి విండో ట్రైలింగ్ ద్వారా డబ్లింగ్ పనులు, మలుపులు, బ్రిడ్జిలు, గుహలలో చేపడుతున్న భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ పర్యటనలో రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్, వాల్తేరు రైల్వే ఏడీఆర్ఎంలు మనోజ్ కుమార్ సాహు, ఇ.శాంతారామ్, చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.రాజ్‌కుమార్, చీఫ్ ట్రాక్ మేనేజర్ కె.ధనుంజయరావు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య విభాగాధిపతి పల్లవికి ప్రొఫెసర్ హోదా

విశాఖపట్నం స్పోర్ట్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ పల్లవికి ప్రొఫెసర్ (ఆచార్య) హోదా లభించింది. ఏయూ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో అకడమిక్ టీచింగ్ స్టాఫ్‌గా కూడా విధులు నిర్వహిస్తున్న పల్లవి.... వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రం విభాగంలో మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) విద్యార్థులకు క్రీడా పాఠ్యాంశాల బోధన, ప్రాక్టికల్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. యోగా, సైకాలజీ డిప్లమో ఇన్ జర్మనీ కోర్సులలో ఉత్తీర్ణత సాధించడంతోపాటు బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఎక్సర్‌సైజ్ ఫిజియాలజీలో ప్రత్యేక ప్రతిభను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ శుక్రవారం తన కార్యాలయంలో ఆచార్య పల్లవిని అభినందించారు.

వైభవంగా సెయింట్ పునీత్ ఆంథోనీ వేడుకలు



చర్చి ప్రాంగణంలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

మహారాణిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఏటా జూన్ 13న జరిగే పునీత్ ఆంథోని మహోత్సవాల సందర్భంగా శుక్రవారం మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ చర్చిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖ బిషప్ ఉడుముల బాలశౌరి, బిషప్ మల్లవరపు ప్రకాష్, ఫాదర్ జోసెఫ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మే 31 నుంచి జూన్ 12 వరకు స్వస్థత ప్రార్థనలు, జపమాల దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పాదర్లు ప్రార్థనలు చేశారు. శుక్రవారం ఉదయం దివ్యబలిపూజ, ప్రార్థనలు, సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న విద్యార్థులతో కార్పొరేటర్ గోవింద్, ఉపాధ్యాయులు

సీతంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మధురానగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ శుక్రవారంపంపిణీ చేశారు. పాఠశాలకు వెళ్లి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని హితవు పలికారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలని ఉపాధ్యాయ బృందాన్ని కోరారు.

ప్రతిభావంతులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో బాలామణి, హెచ్ఎం రాధాకుమారి

అక్కయ్యపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో సుమారు ఐదొందల మార్కులు సాధించిన వారు, ఐఐటీలో చేరిన విద్యార్థులను శుక్రవారం హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంఈవో బాలామణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఎంఎస్‌వీ విశ్వనాథంకు తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించడంతో ఆయనను, విద్యార్థులను జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పీడీ సునంద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, నిర్మల, టి.కిశోర్, వై.రామలక్ష్మి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు పాల్గొన్నారు.

కూలిన షాపింగ్ కాంప్లెక్స్ బాల్కనీ స్లాబ్

దొండపర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 27వ వార్డు నెహ్రూ బజారులోని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపుల ముందు ఉన్న బాల్కనీ స్లాబ్ శుక్రవారం పూర్తిగా జారిపోయింది. కొన్నేళ్లుగా బాల్కనీ కాలమ్‌లు దెబ్బతినడంతో అది జారి కిందపడిపోయింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఎస్ఈ సత్యనారాయణరాజు, ఈఈ గంగాధర్, డీఈ విజయ్‌కుమార్, ఏఈ నిహారికలతో కలిసి కూలిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వీరారావు మాట్లాడుతూ ఉదయం 6-30 గంటల సమయంలో బజారు ఇంకా పూర్తిగా తెరవకపోవడంతో కూలిపోవడంతో జనాలు లేక ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. కాంప్లెక్స్ నిర్మించి చాలా ఏళ్లు కావడంతో కొంత భాగం శిథిలమైందని, ప్రస్తుతం వీటికి మరమ్మతులు చేసే అవకాశం తక్కువగా ఉండడంతో ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రతిపాదనలు తయారు చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.



స్లాబ్ కూలిన ప్రాంతంలో జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ వీరారావు

సెక్యూరిటీ సిబ్బంది చేతికి లాఠీలు!



కేజీహెచ్‌లో లాఠీతో సెక్యూరిటీ ఉద్యోగి

మహారాణిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్తికేయ అనే ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ సిబ్బంది చేతికి లాఠీలు అందించారు. వారికి లాఠీలు ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదని పలువురు విస్తుపోతున్నారు. ఆస్పత్రుల్లో సెక్యూరిటీ చేసే పనుల్లో ఎమర్జెన్సీ కేసులను ముందుగా పంపించడం, రోగులను క్రమపద్ధతిలో లోపలకు పంపించడం, వాహనాలను పార్కింగ్‌లో పెట్టేలా చూసుకోవడం వంటివి ఎక్కువగా చేస్తుంటారు. అయితే లాఠీ పనే ఉండదని అంటున్నారు. వచ్చిన వారిని అదుపు చేసేంత రద్దీ కూడా ఉండదని తెలిసిన విషయమే. పోలీసులు కూడా అత్యవసరమైతే తప్ప లాఠీ బయటకు తీయరు, అటువంటిది సెక్యూరిటీ గార్డులకు లాఠీలు ఇవ్వడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆస్పత్రికి రోగులు, వారితో పాటు సహాయకులు మాత్రమే వస్తారు. అప్పుడప్పుడు మాత్రం వైద్యం సరిగా అందక రోగులు, వారి సహాయకులు తమ బాధను చెప్పుకుంటారు, నిరసనలు చేస్తారు తప్ప దాడులు చేయరు. అనుకోని సందర్భంలో సెక్యూరిటీ సిబ్బంది సహనం కోల్పోయి ఎవరిమీదనన్నా లాఠీ వాడి అది తగలిరాని చోట తగిలితే పెద్ద సమస్య వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అధ్వానంగా పార్కు పరిసరాలు



బృందావనం పార్కు పక్కనే చెత్త

మురళీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ బృందావనం పార్కు పరిసరాలు చెత్తతో దర్శనమిస్తున్నాయి. పార్కు ప్రహరీని ఆనుకొని ఉన్న నివాసితుల ఇళ్ల ఎదుటే పేరుకుపోయిన చెత్తతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు జీవీఎంసీ, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. పార్కు గోడను ఆనుకొని ఉన్న వ్యర్థాలను రోజుల తరబడి అక్కడే వదిలేయడంతో వర్షాకాలంలో అపరిశుభ్రంగా పరిసరాలు తయారవుతాయని ఆందోళన చెందుతున్నారు. శానిటరీ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న టీచర్ల కౌన్సెలింగ్

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ మూడో రోజు శుక్రవారం కొనసాగింది. సీనియారిటీ జాబితాలో 801 నుంచి 1,600 నంబర్ వరకూ గల వారిని కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి 1,200 వరకూ పూర్తిచేశారు. నగరానికి ఆనుకుని ఉన్న చినగదిలి, గోపాలపట్నం, గాజువాక, పెదగంట్యాడ, భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఎస్జీటీ ఖాళీలు పూర్తిగా భర్తీచేశారు. ఇంకా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలంలో మొత్తం ఖాళీలు భర్తీ అయ్యాయి. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్, మూడు జిల్లాల డీఈవోలు ప్రేమ్‌కుమార్, అప్పారావునాయుడు, బ్రహ్మాజీలు కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సీనియారిటీ జాబితాలో 1,601 నుంచి చివర నంబరు అంటే 2,468 వరకూ గల టీచర్లకు బదిలీలు నిర్వహించనున్నారు. శనివారంతో కౌన్సెలింగ్ పూర్తిచేయాలని నిర్ణయించారు.

త్రిశంకుస్వర్గంలో భాషోపాధ్యాయులు

(5వ పేజీ తరువాయి)

48 మందిని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెంకొత్తవీధి, పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి మండలాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో పోస్టింగ్ ఇస్తామని, మిగిలిన 18 మందిని క్లస్టర్ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం జడ్పీ ప్రాంగణంలో టీచర్ల కౌన్సెలింగ్ జరుగుతున్న హాలు ముందు భాషోపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్లు మాట్లాడుతూ 66 మందిలో 50 మంది వరకూ మహిళలే ఉన్నారని, ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. తమను మైదాన ప్రాంతంలో ఏ మూలైనా యూపీ పాఠశాలలకు పంపాలని డిమాండ్ చేశారు. వారి తరపున ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు వెంకటపతిరాజు, గోపీనాథ్, తదితరులు విశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్, అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడుతో చర్చలు జరిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తిచేశారు.

విశాఖ డెయిరీలో 400 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

(5వ పేజీ తరువాయి)

పలికారు. కార్మికులకు కనీస వేతనాల అమలు, సౌకర్యాలు కల్పించడంతో విఫలమైన యాజమాన్యం...ఇప్పుడు అకారణంగా తొలగించడం సిగ్గుచేటని నరసింగరావు ఆరోపించారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంరాంబాబు, ఎ.లోకేష్, రాజేంద్రప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

క్షణికావేశంలో దారుణం

(5వ పేజీ తరువాయి)

వారిని గోపీనాథ్ వేరొక గదిలో పెట్టి తలుపులు వేసినట్టు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భర్త వేధింపులపై వెంకటలక్ష్మి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, గోపీనాథ్‌పై చర్యలు తీసుకుని ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు.

వేటకు వేళాయె

(5వ పేజీ తరువాయి)

రెండు నుంచి నాలుగు మరబోట్లు సమకూర్చుకొని, వేటకు కూలీలను పంపించేవారు. హార్బర్‌కు తిరిగి వచ్చాక దొరికిన దాంట్లో కొంత పర్సంటేజీతో పాటు చిల్లర చేపలన్నీ వారికి ఇచ్చేవారు. ప్రతి బోటుకు డ్రైవర్‌తో సహా పది మంది వరకు కూలీలు ఉండడంతో వాటాలు పంచేసరికి యజమానికి పెట్టుబడికి తగిన ప్రతిఫలం రావడం లేదు. ఒక వాయేజ్ అంటే రెండు వారాలు సముద్రంలో వేట సాగించడానికి డీజిల్, ఐస్, ఆహారం కోసం సుమారు రూ.4 లక్షల వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. అందరికీ వాటాలు ఇచ్చాక పెట్టుబడి వస్తే చాలనే భావన కలుగుతోంది. దాంతో కొందరు వేటకు దూరంగా ఉంటున్నారు.

తొలి మూడు నెలలు అంటే సెప్టెంబరు వరకూ ఎక్కువగా రొయ్యలే పడతాయి. వీటికి ఇంతకు ముందులా డిమాండ్ లేదు. ఉభయ గోదావరి, నెల్లూరు జిల్లాల్లో వనామీ రొయ్యలను సాగు చేయడం వల్ల అవి తక్కువ రేటుకే లభిస్తున్నాయి. సముద్రపు రొయ్యలకు ఎగుమతిదారులు ఎక్కువ రేటు ఇవ్వడం లేదు. సెప్టెంబరు నెలాఖరు నుంచి చేపలు బాగా దొరుకుతాయి. వాటికి మంచి రేటు, డిమాండ్ కూడా ఉంటోంది. అందుకని చాలామంది బోట్లకు హక్కులు వేసుకొని చేపల వేటకు వెళుతున్నారు. చాలామంది ఓనర్లు కూలీలతో బోట్లు తిప్పడం లేదు. ఓనర్ కమ్ డ్రైవర్‌గా ఉండేవారు వేటకు వెళితేనే గిట్టుబాటు అవుతోంది. వారే ఇప్పుడు ముందుగా వేటకు వెళుతున్నారు.

తల్లుల్లో ఆనందోత్సాహాలు

(5వ పేజీ తరువాయి)

జమ కానున్నది. గురువారం సాయంత్రం నుంచే తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కావడం మొదలైంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున నిధులు విడుదల చేయగా, వాటిలో రూ.13 వేలు తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తున్నది. ఉదాహరణకు ఇద్దరు పిల్లలు ఉంటే తల్లి బ్యాంకు ఖాతాలో రూ.26 వేలు, ముగ్గురు పిల్లలు ఉంటే రూ.39 వేలు, నలుగురు పిల్లలు ఉంటే రూ.52 వేలు, ఐదుగురు పిల్లలు వుంటే రూ.65 వేలు జమ అవుతున్నాయి. మిగిలిన రూ.2 వేలను పాఠశాలల అభివృద్ధి, నిర్వహణ కోసం కలెక్టర్ ఖాతాలో జమ చేస్తుంది.

వైసీపీ ప్రభుత్వంలో కంటే చాలా అధికం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరగా 2023 జూన్ మూడోవారంలో 1,70,476 మందికి రూ.221 కోట్లు జమ చేశారు. ప్రస్తుతం 1,90,433 మందికి రూ.245 కోట్లు జమ కానున్నది. అయితే ఒకటి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరనున్న విద్యార్థులు దీనికి అదనం. అంటే మరో 30 నుంచి 35 వేల మంది వరకూ ఉండవచ్చునని అంచనా. అంటే తల్లికి వందనం సొమ్ములు తీసుకోనున్న విద్యార్థుల సంఖ్య 2.2 లక్షల దాటనున్నది.

1,325 మంది ఖాతాలకు సాంకేతిక సమస్య

జిల్లాలో 1,325 మంది ఎస్సీ విద్యార్థుల తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ చేయడానికి సాంకేతిక సమస్య ఉన్నట్టు అధికారులు గుర్తించారు. తల్లుల ఆధార్ నంబరుకు ఎన్‌పీసీఐ అనుసంధానం కాకపోవడంతో సొమ్ములు జమ కాలేదు. ఈ నేపథ్యంలో 1,325 మంది శనివారం కొత్తగా ఖాతాలు ప్రారంభించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కంచరాన రామారావు తెలిపారు. లేదా తమ ప్రాంతంలోని సచివాలయాలకు వెళ్లి అక్కడ సిబ్బందిని సంప్రతించాలని సూచించారు.

20లోపు సచివాలయాలను సంప్రతించాలి

కాగా బ్యాంకు ఖాతాలు సక్రమంగా నిర్వహించుకోకపోవడం, ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయని కారణంగా అర్హుల జాబితాలో పేర్లు వున్నప్పటికీ ఖాతాలో డబ్బులు జమ కావడం లేదు. ఇటువంటివారు ఈ నెల 20వ తేదీలోగా గ్రామ/వార్డు సచివాలయాల్లో తెలియపరచాలని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా ఈ పథకానికి అర్హులై వుండి, జాబితాల్లో పేరు లేని వారు కూడా సచివాలయాల్లో సంప్రతించాలి. జూన్ 30వ తేదీన తుది జాబితా విడుదల చేసి, మిగిలిన అర్హులకు జూలై 5న నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

నాడు ఒక్కరికే... ఇప్పుడు ఎంతమంది ఉంటే అంతమందికీ...

వైసీపీ అధికారంలో వున్నప్పుడు 'అమ్మ ఒడి' పేరుతో పథకాన్ని అమలు చేసింది. అయితే కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నప్పటికీ ఒక్కరికే సాయం అందించింది. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంతమంది పిల్లలు వుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకం కింద సాయం అందిస్తున్నది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాలు అనేకం

(5వ పేజీ తరువాయి)

సేఫ్టీ పనులు కాకుండా ఎవరైనా కంపెనీకి వస్తే రైల్వేస్టేషన్‌కు, ఎయిర్‌పోర్టుకి వెళ్లి వారిని పికప్ చేసుకొని రావాలని డ్రైవర్ డ్యూటీ చేయిస్తున్నారని కుసుమ ఆరోపించారు. ఇదే అంశంపై తాను భర్తతో ఒకటి, రెండుసార్లు గొడవ పడ్డానని, నువ్వు డ్రైవర్‌వా? అసిస్టెంట్ మేనేజర్‌వా?...అని అడిగానన్నారు. చాలామంది అక్కడి వేధింపులు భరించలేక మానేస్తున్నారని, తన భర్త కూడా మానేయాలని అనుకున్నా...చంటిపిల్ల ఉండడంతో వెంటనే వేరే ఉద్యోగం దొరక్కపోతే ఎలా?...అని ఆలోచించారని పేర్కొంది. యాజమాన్య ప్రతినిధులు ఒకటి, రెండు సార్లు బెదిరిస్తే...తనకు కూడా సర్కిల్ ఉందని ఆయన చెప్పడంతో వారు వెనక్కి తగ్గారని ఆమె తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై తనకు అనుమానాలు ఉన్నాయని, విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

ఘటన నేపథ్యంపై గోప్యత

సాయి శ్రేయాస్‌లో విషవాయువులు అని అధికారులు చెబుతున్నారే తప్ప అది ఏమిటనేది సాంకేతికంగా బయటకు చెప్పడం లేదు. ఒక అధికారి అక్కడ హైడ్రోజన్ సల్ఫైడ్ (హెచ్2ఎస్) విడుదలైందని చెబుతుంటే...దానిని ప్రజా శాస్త్రవేత్తల బృందం ఖండిస్తోంది. ఏ రకమైన రసాయనాలు అక్కడ ఉన్నాయో చెప్పకుండా హెచ్2ఎస్ అని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నిస్తోంది. ఈ ప్రమాద ఘటన క్రమం ఏమిటి?, ఏ రసాయనాల వల్ల జరిగిందనేది కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఫ్యాక్టరీస్ విభాగం పెద్దలు చెప్పడం లేదు. అసలు ఫ్యాక్టరీస్ విభాగం అక్కడ ఏ రకమైన తనిఖీలు చేసిందో కూడా వెల్లడించడం లేదు. ఆ శాఖ అధికారులు కార్యాలయంలో ఉండడం లేదు. ఫోన్లకు స్పందించడం లేదు. నష్టపరిహారం ఇచ్చేశారు కాబట్టి కేసును క్లోజ్ చేయాలని అంతా కలసి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, దాని నిర్వహణపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సి ఉంది.

ఉక్కు పరిరక్షణ కోసం ప్లాంటులో నేడు రక్తదానం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన కార్యక్రమంనిర్వహించనున్నట్టు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాంటు సీడబ్ల్యూసీ-1లో జరగనున్న రక్తదాన శిబిరంలో ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణవేణి


ప్రిన్సిపాల్ కృష్ణవేణి

అగనంపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. ఈమె ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలోలలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన సుధాకర్ నాయుడు అనకాపల్లి జిల్లా కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటు కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి పేర్కొన్నారు.

రేపు శ్రవణా నక్షత్ర వేడుకలు


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకన్న

వేపగుంట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవిన గర్ శేషాద్రిపై కొలవైన కల్యాణ వెంకటేశ్వర ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామపారాయణం చేస్తామని పేర్కొన్నారు.

త్వరలో జీవీఎంసీ ఆస్పత్రిలో కోరమాండల్ వైద్యసేవలు

మల్కాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రికి మహర్దశ పట్టనుంది. పది రూపాలయకే వైద్యసేవలు అందించడానికి కోరమాండల్ ఎరువుల కర్మాగారం అడుగులు వేస్తోంది. కంపెనీ చేసే సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా త్వరలోనే జీవీఎంసీ ఆస్పత్రిలో సేవలు అందించనుంది. వచ్చే 30 సంవత్సరాల్లో ఈ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా జీవీఎంసీతో కోరమాండల్ ఎంవోయూ కుదుర్చుకునేందుకు సిద్ధమయింది. ఎంవోయూ కుదిరిన వెంటనే ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు కోరమాండల్ నిర్ణయం తీసుకుంది.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 18, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 34, బీరకాయలు 26, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 40 దొండకాయలు 18, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)52, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కారం

» సీజేఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ


పెదగంట్యాడ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన సీజేఆర్ఎఫ్ సదస్సులో మాట్లాడుతున్న సీజేఆర్ఎఫ్ చైర్‌పర్సన్ సత్యనారాయణ

పెదగంట్యాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యలను సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజేఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. పెదగంట్యాడ సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సీజేఆర్ఎఫ్ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్తసర్వీసుల జారీలో జాప్యం వంటి సమస్యలను సీజేఆర్ఎఫ్ సదస్సు దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు సంబంధిత సమస్యలపై సీతమ్మధారలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సీజేఆర్ఎఫ్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పెదగంట్యాడ, గంగవరం, దయాళ్‌నగర్ శ్రీహరిపురం తదితర ప్రాంతాలకు చెందిన విద్యుత్తు వినియోగదారులు సీజేఆర్ఎఫ్ సదస్సులో పాల్గొని తాము ఎదుర్కొంటున్న సమస్యలను సీజేఆర్ఎఫ్ చైర్మన్‌కు వివరించారు. అనంతరం వినతి పత్రాలను అందజేశారు. సీజేఆర్ఎఫ్ సభ్యులు మురళీకృష్ణ, డీఈఈ మాధవి, ఏడీఈ రామకృష్ణ, ఈఈ డీకే నాయుడు, పెదగంట్యాడ అర్బన్ ఏఈ వై.రాజేంద్రప్రసాద్, గంగవరం ఏఈ ఎం.జ్యోతి పాల్గొన్నారు.

'సూర్య ఘర్'తో విద్యుత్ ఆదా

» ఈపీడీసీఎల్ ఏడీసీ అడబాల పార్థసారథి, ఏఈ రాయుడు రామకృష్ణ


అవగాహన కల్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

గాజువాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలంటే విధిగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనలో పథకంలో చేరాలని, సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోవాలని ఈపీడీసీఎల్ ఏడీసీ అడబాల పార్థసారథి, ఏఈ రాయుడు రామకృష్ణ పేర్కొన్నారు. జీవీఎంసీ 72వ వార్డు చైతన్య నగర్ గ్రంథాలయంలో శుక్రవారం సోలార్ రూఫ్ టాప్‌లపై ఇంటింటికీ నిర్వహించిన సర్వేలో భాగంగా వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు కరెంటు బిల్లులను తగ్గించటమే కాకుండా, ఇంధన రంగంలో భారత్ స్వావలంబన దిశగా పయనించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వంరాయితీ ద్వారా వినియోగదారులకు లబ్ధి చేకూరుస్తుందన్నారు.

ఒక కిలోవాట్ వ్యవస్థకు రూ.30 వేలు, ఉత్పత్తి అయ్యే 120 యూనిట్లు, వినియోగదారునకు ప్రస్తుతం రూ.1000 బిల్లు వస్తుంటే సోలార్ ఏర్పాటు తర్వాత రూ.338, ఏడాదికి రూ.8000 వేలు ఆదా అవుతుందన్నారు. 2 కిలోవాట్ల వ్యవస్థకు రూ.60 వేలు, 3 కిలోవాట్ల వ్యవస్థకు రూ.78 వేలు కేంద్రం నుంచి రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఏజె స్టాలిన్, టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు, నాయకులు విజయ సాయి, జనసేన నాయకులు గడసాల అప్పారావు, గ్రంథాలయ సిబ్బంది సుబ్బారావు, వేంకటేశ్వరరావు విద్యుత్ విభాగ సిబ్బంది, లైన్‌మెన్లు పలువురు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

పార్కులో సమస్యల పరిష్కారానికి కృషి

» కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్


పార్కు సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి జనచైతన్య నగర్‌లో గల పార్కు, నడక మైదానంలోని సమస్యలను పరిష్కారిస్తానని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శకులు, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కులో లైటింగ్ సదుపాయం కల్పించాలని, అలాగే తాగునీటి లేకపోవడడంతో ఇబ్బందులు పడుతున్నామని వారంతా చెప్పారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ పార్కులో రింగు లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు మంచి నీరు సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బుల్లెట్ రాజు, సింగిడి సింహాచలం, మాడిశ వెంకటరావు, నాగశ్వరరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి ప్రత్యేక అవసరాల పిల్లలు

పెదగంట్యాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండల పరిధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన ఐదుగురు పిల్లలను విద్యాశాఖాధికారులు గుర్తించి వారి తల్లిదండ్రులతో పాటు వారిని శుక్రవారం నెల్లిముక్కులోని భవిత కేంద్రాని తీసుకొచ్చి పిల్లలను చేర్పించారు. మండలంలో వారం రోజుల పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ అప్పలనాయుడు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎం.సూర్యనారాయణ, జయభారతి ఆధ్వర్యంలో పెదగంట్యాడ, కణితి, గొంతెనవానిపాలెం, నడుపూరు, బానోజీ కాలనీలో ప్రత్యేక సర్వే నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

» కార్పొరేటర్ వెంకటరమేశ్

గోపాలపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్‌ను వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రత్నమాల, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులతో భోజనం తింటున్న వెంకటరమేశ్

పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరకుల పంపిణీ

ఆటోనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు శ్రీనగర్ సచివాలయంలో శుక్రవారం జీవీఎంసీ ఆధ్వర్యంలో శానిటరీ సిబ్బందికి కార్పొరేటర్ రాజాన రామారావు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కరోనా సమయంలో అందించిన సేవలు వర్ణించ లేనివన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తాతారావు, బాబ్జీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు వడ్లపూడి సచివాలయంలో శుక్రవారం జీవీఎంసీ ఆధ్వర్యంలో శానిటరీ సిబ్బందికి కార్పొరేటర్ బొండా జగన్, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రాజన్‌రాజు, సూరిశెట్టి పెంటారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ప్రగడ దానయ్య, సచివాలయం, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


87వ వార్డులో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొండా జగన్


71వ వార్డులో పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజాన రామారావు

ఎమ్మెల్యే పంచకర్ల పేరిట సేవా కార్యక్రమాలు


వృద్ధులకు అన్నదానం చేస్తున్న జనసేన జిల్లా కార్యదర్శి

పెందుర్తి, జూన్ 13:(ఆంధ్రజ్యోతి): పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే పంచకర్ల జన్మదిన్నాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో పులుచోట్ల కూటమి శ్రేణులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. గుజరాత్‌లో విమాన ప్రమాదం జరిగిన కారణంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉన్నారు. నేతలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అయిుతి సింహాచలంనాయడు ఆధ్వర్యంలో లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ముదునూరి రాజా సుధాకర్, కిశోర్, సేనాపతి సోమశేఖర్, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, సుధారాణి పాల్గొన్నారు. జనసేన నేత రాజా సుధాకర్ ఆధ్వర్యంలో కంచిపాటి మధు,సేనాపతి సోమశేఖర్, బయలపూడి హరగోపాల్, మహేశ్, గుమ్మిడి కృష్ణ, ముమ్మన గురువులు, మడక బంగార్రాజు,చదరం భీమేశ్వరరావు, పెందుర్తి మణి, తదితర నేతలు స్థానిక వెంకటాద్రి ఆలయంలో ఎమ్మెల్యే పేరిటి పూజలుచేయించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అలాగే ఎం, సుధాకర్‌రాజు, కరణం కనకారావు ఆధ్వర్యంలో వేపగుంట, గౌతమ్‌నగర్, లక్ష్మీపురంలో ఉన్న అనాధ ఆశ్రమంలో విద్యార్థులకు అల్పాహార ఏర్పాటు చేశారు. నరవలో జనసేన నేత గల్లా శ్రీను ఆధ్వర్యంలో ఇల్లపు శ్రీనువాసరావు, నందవరపు సన్యాసిరావు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.


ఎమ్మెల్యే పేరిట పూజలు చేయించిన ముదునూరి రాజాసుధాకర్, కూటమి నేతలు

పల్లా సింహాచలానికి టీడీపీ నేతల నివాళి


పల్లాకు నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

కూర్మన్నపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) :మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణంపై టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణసంతాపం వ్యక్తం చేశారు. మాతృశ్రీ నగర్‌లో శుక్రవారం పల్లా సింహాచలం చిత్రపటానికి టీడీపీ వార్డు నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నల్లూరు మాట్లాడుతూ పల్లా సింహాచలం మృతి టీడీపీకి తీరని లోటు అన్నారు.కార్యక్రమంలో టీడీపీ వార్డు కార్యదర్శి వేగుంట శ్రీనివాస్, గణపతి, రమేష్, వేంకటేష్, జగదీష్, సుబ్బయ్య, నాగార్జున, బుజ్జమ్మ, అప్పారావు, బాలకృష్ణ, సింహాద్రి, గోవింద్ పాల్గొన్నారు.

ఉక్కు ప్రమాద మృతులకు నివాళులు


ఉక్కు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : 2012, జూన్ 13న స్టీల్‌ప్లాంటు ఎస్ఎంఎస్ విభాగంలో జరిగి ఘోర ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు గుర్తింపు యూనియన్ నాయకులు ప్లాంట్ ఐటీఐ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నివాళులు అర్పించారు. అనంతరం గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు మాట్లాడుతూ ప్లాంటు చరిత్రలో ఆ రోజు చీకటి రోజు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చీకటి శ్రీనివాస్, మోహన్‌బాబు, రాజుబాబు, కాశీరమణ పాల్గొన్నారు.

బోధనలో కొత్త పద్ధతులపై అవగాహన

మల్కాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయక ఉపన్యాస పద్ధతిలో కాకుండా విద్యార్థి ఆధారిత బోధన అధ్యాపకులు దృష్టిపెట్టాలని విద్యావేత్త యోగేశ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఈనెల 12, 13 తేదీలలో నిర్వహించిన రెండురోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాచారం అనేక మార్గాలు ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉంటోందని దాలివల్ల అధ్యాపకులు సమాచారాన్ని ఇవ్వడం పైకాక విద్యార్థులను ఉత్తేజపరిచే పద్ధతులపై దృష్టి పెట్టాలని అన్నారు. గ్రూప్ డిస్కషన్, సెమినార్ల వల్ల విద్యార్థులు తరగతి గదిలో క్రియాశీలకం చదువును అభ్యసించాలని అన్నారు. కళాశాలలో పాటించాల్సిన నియమ నిబంధనలు ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి వివరించారు. పలువురు అధ్యాపకులు బోధనా పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిని కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అభినందించారు.

తరచూ విద్యుత్ అంతరాయాలు


విద్యుత్ అంతరాయానికి కారణమవుతున్న వైర్లు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గవర వీధిలో దాదాపు 30 ఇళ్లకు విద్యుత్తు సరఫరాలో లోఓల్టేజీ, అంతరాయం సమస్యలతో తరుచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గవరవీధిలో ఉన్న 103 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఇళ్లకు పోల్ టూ పోల్ కేబుల్స్ వేశారు. అవి సరిగా వేయకపోవడంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ అధికారులు రావడం కాలిపోయిన వైరును తీసి కొత్త వైరు వేయడం ఇలానే చేస్తున్నారు. కొన్ని రోజులకు యథావిధిగా విద్యుత్ సమస్యలు వస్తున్నాయి. తమకున్న విద్యుత్ సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేసి నెల గడుస్తున్న ఇప్పటి ఎలువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్


87వ వార్డు బొట్టవానిపాలెంలో నిర్వహించిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో మాట్లాడుతున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ పేర్కొన్నారు. డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో బాగంగా జీవీఎంసీ శానిటరీ, మలేరియా విభాగం ఆధ్వర్యంలో 87వ వార్డు బొట్టవానిపాలెంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మలేరియా సిబ్బంది వివరించారు. వారానికి ఒక రోజు డ్రైడేని పాటించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రాజన్‌రాజు, బొట్టా ప్రకాష్, శానిటరీ అధికారులు, అప్పారావు, జీవిశ్వేశ్వరరావు, నాగభూషణం, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది నరేష్‌కుమార్, నీలిమ, సంధ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కోన' జన్మదిన వేడుకలు


కోన తాతారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న అగనంపూడి జనసేన నేతలు

అగనంపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ చెర్మన్ కోన తాతారావు జన్మదిన వేడుకలను శుక్రవారం జనసేన శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 85వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు గవర సోమశేఖర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నేతలు, కార్యకర్తలు తాతారావును కలిసి జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పామల వసంతరావు, గవర నరసింగరావు, కర్రి బంగారునాయుడు, పైడిరత్నం, నక్కా గోవింద్, మాధవ్ తదితరులు

కోనను కలిసిన చేనేత సంఘ నాయకులు

శ్రీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం 71వ వార్డులోని శ్రీనగర్‌కు చెందిన ఏపీ పద్మశాలి సంఘ కన్వీనర్ పప్పు రాజారావు ఆధ్వర్యంలో చేనేత కుల నాయకులు తరలివెళ్లి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న పప్పు రాజారావు మాట్లాడుతూ కోన తాతారావు బవిష్యత్తులో ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. గ్రేటర్ విశాఖ 87వ వార్డు జనసేన నాయకులు సిరసపల్లి కనకరాజు, 86 వార్డు జనసేన నాయకులు కాద శ్రీను ఆదర్యంలో జనసైనికులు, వీర మహిళలు తరలి వెళ్లి కోన తాతారావుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీ కుల పెద్దలు జగ్గారావు, రాజు, 71, 86 వార్డుల జనసేన నాయకులు పాల్గొన్నారు.


కోన తాతారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెల్పుతున్న చేనేత నాయకులు, మహిళలు

'సమ్మెకు సిద్ధంగా ఉండండి'


సభలో మాట్లాడుతున్న పిల్లా శంకర్‌రావు

మల్కాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కారించుకోవాలంటే పోరాటమే శరణ్యమని, అందుకు కార్మికులు సిద్ధమవ్వాలని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి పీవీ మోహన్, గాజువాక ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ కార్యదర్శి పిల్లా శంకర్‌రావు కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మె చేసేందుకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులను చైతన్యం చేసేందుకు రాష్ట్ర కార్యదర్శి మోహన్ గాజువాక ఆర్టీసీ డిపోకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెకోసం ఆర్టీసీ కార్మికులు నోటీసులు ఇచ్చారని, ఎప్పుడు సమ్మెకు ముందునుంచే సిద్ధంగా ఉండాలని అన్నారు. ఇంతక ముందు తమకున్న సమస్యలు అధకారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పలువురు కార్మికులు అన్నారు. సమస్యల పరిష్కారానికి సమ్మె ఒకటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్‌మూర్తి, విజయనగరం మాజీ జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, డివిజనల్ ప్రెసిడెంట్ పీఎస్ఆర్ మూర్తి, గాజువాక డిపో అధ్యక్షుడు పి.సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

లిగ్మెంట్ టేర్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్, కిమ్ ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 15న నగరంలో నిర్వహించనున్న లిగ్మెంట్ టేర్ అవగాహన సదస్సు బ్రోచర్‌ను కేజీహెచ్ సూపరిండెంటెంట్ డాక్టర్ శివానంద ఆవిష్కరించారు. శుక్రవారం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 15న నగరంలోని ఫోర్ పాయింట్స్ బై షెరటాన్ హోటల్‌లో నిర్వహిస్తున్న ఒక రోజు సదస్సులో సుమారు 150 మంది ఆర్థోపెడిక్ వైద్యులు హాజరవుతారని చెప్పారు.

తహశీల్దార్ బాధ్యతలు ఎప్పుడు తీసుకుంటారో?

మల్కాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండలం తహశీల్దార్ భుజంగరావు బదిలీలో భాగంగా అనకాపల్లి జిల్లాకు వెళ్లిపోయారు. కానీ ఇక్కడ మండలానికి నియమించిన తహశీల్దార్ రమేశ్ బాధ్యతలు స్వీకరించలేదు. ప్రస్తుతం డిప్యూటీ తహశీల్దార్ రమాకు కూడా ఇన్‌చార్జిగా బాధ్యతలకు అప్పగించలేదు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ లేకపోవడంతో కొన్ని సర్టిఫికేట్‌లు ఆగిపోతున్నాయి. రమేశ్ త్వరగా తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రాణదాతలు

రక్తదానానికి ఎంతోమంది సుముఖత

అపోహలతో ఇంకా కొందరు దూరం

- ఏటా మూడుసార్లు రక్తదానం చేస్తే ఆరోగ్యం
- నేడు స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం





విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా అనేక ఆవిష్కరణలు జరుగుతున్నాయి. వైద్య రంగంలోనూ సరికొత్త సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే, ఇప్పటికీ అత్యవసర పరిస్థితులలో మనిషి ప్రాణాన్ని నిలబెట్టే రక్తాన్ని సాటి మనిషి మాత్రమే ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంత అభివృద్ధి చెందినా, రక్తాన్ని తయారు చేసే సరికొత్త సాంకేతికత మాత్రం అందుబాటులోకి రాలేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి మరో మనిషి మాత్రమే రక్తాన్ని అందించి కాపాడాలి. ఒకప్పుడు రక్తదానానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. దీంతో అనేకమంది సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితిలో మార్పు తేవడానికి తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. రక్తదానంపై అపోహలు తొలగించేలా చైతన్యపరిచారు. ఇప్పటికీ కొందరిలో అపోహలు, భయాలు ఉన్నా, రక్తదానానికి వెనుకంజ వేస్తున్నా, గతంతో పోలిస్తే ముందడుగు వేసినట్లే. ఏటా జూన్ 14న స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమాజంలో తాజా పరిస్థితులపై ప్రత్యేక కథనం.

రక్తదానంతో నలుగురి ప్రాణాలు నిలబెట్టవచ్చు

ఓ వ్యక్తి ఒకసారి రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నలుగురి ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంది. రక్తదానం చేసిన వ్యక్తి నుంచి రక్తం, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ సేకరించి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంది. అంటే ప్రతి మనిషి ఏడాదికి 12 మంది ప్రాణాలను నిలబెట్టగలిగే అవకాశం, వెలలేని సంతృప్తి పొందే అవకాశం ఉంది. కావలసిందల్లా అపోహలు తొలగించుకోవడమే.

రక్తంలో ఏముంటాయంటే.?

ప్రతి ఒక్కరి శరీరంలో కనీసం ఐదు నుంచి ఆరు లీటర్ల రక్తం ఉండాలి. కేజీ శరీరం బరువుకు 80 ఎంఎల్ చొప్పున రక్తం ఉండాలి. శరీరంలోని అవయవాలు సక్రమంగా పని చేసేందుకు ఈ రక్తం ఉపయోగపడుతుంది. రక్తంలో 55 శాతం ప్లాస్మా, 45 శాతం సెల్స్ ఉంటాయి. ప్లాస్మాలో 91 శాతం నీరు, 8 శాతం ఆర్గానిక్ మాలిక్యూల్స్, ఒక శాతం ఇనార్గానిక్ మాలిక్యూల్స్ ఉంటాయి. సెల్స్‌లో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్ లెట్స్ ఉంటాయి. ఒక లీటర్ రక్తంలో ఎర్ర రక్తకణాలు 5-6 మిలియన్లు ఉంటాయి. ఇవి ఆక్సిజన్ సరఫరాకు తోడ్పడతాయి. తెల్ల రక్తకణాలు 4-11 మిలియన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని ఇన్‌ఫెక్షన్‌పై దాడి చేసి రక్షణ కల్పిస్తాయి. ప్లేట్‌లెట్స్ కణాలు 1.5-4 మిలియన్లు ఉంటాయి. ఇవి రక్తం గడ్డ కట్టడానికి సహకరిస్తాయి. ఎర్ర రక్త కణాలు తగ్గితే ఎనీమియా అంటారు. ఎర్ర రక్తకణాలు శరీరంలో ఆక్సిజన్ సరఫరాకు ఉపయోగపడతాయి. ఐరన్, పోలిక్ ఆసిడ్, విటమిన్ బి 12, విటమిన్ సి, తగినంత ప్రోటీన్లు లేకపోవడం వల్ల రక్తహీనత ఏర్పడుతుంది.

రక్తం అవసరం ఎప్పుడంటే.?

రక్తం అత్యవసర సమయాల్లో తప్పనిసరిగా అవసరం. ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం జరిగినా, గర్భ సంబంధ వ్యాధులకు గురైనా, రోడ్డు ప్రమాదాల సమయంలో, లివర్ సమస్య వేధించినా, తలసేమియా బాధిత చిన్నారులకు, నెలలు నిండకుండా పుట్టిన చిన్నారులకు, రక్త క్యాన్సర్, కీమోథెరపీ, గుండె, ఇతర శస్త్రచికిత్సల సమయాల్లో, రక్తలేమి, రక్తహీనత సమస్యలతో బాధపడుతున్న వారికి రక్తం అవసరమవుతుంది.

రక్తదానానికి అర్హులు వీరే

రక్తదాతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. 18-60 ఏళ్ల మధ్య వయస్కులై ఉండాలి. రక్తదాత 45 కేజీలపైబడి బరువుండాలి. సాధారణ స్థాయిలో బీపీ, షుగర్ ఉండాలి, మూడు నెలల వ్యవధిలో ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయొచ్చు. రక్తదానం చేయడానికి 12 గంటల ముందు, తరువాత ఆల్కహాల్ తీసుకోకూడదు. రుతుక్రమం, గర్భధారణ నుంచి బిడ్డకు పాలివ్వడం ఆపేంత వరకు రక్తదానం చేయకూడదు.

బ్లడ్ మ్యాన్ ఆఫ్ వైజాగ్ వినోద్ బాలు



నగరానికి చెందిన ఉడుముల వినోద్‌బాలు బ్లడ్ మ్యాన్ ఆఫ్ వైజాగ్‌గా పేరుగాంచారు. తన తండ్రి తాతబాబుకు 2001లో హిమోగ్లోబిన్ పరిమాణం పూర్తిగా పడిపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. ఆ సమయంలో రక్తదాతల కోసం ఎంతో ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది. సమీప బంధువులు వచ్చి రక్తదానం చేసి ప్రాణాలు నిలబెట్టారు. అప్పుడు రక్తదానం గొప్పతనాన్ని తెలుసుకున్న బాలు.. దాన్నే యజ్ఞంగా కొనసాగిస్తూ వస్తున్నారు. 2008లో ఎన్ఎస్ఎస్ బెస్ట్ వాలంటీర్‌గా ఎంపికైన ఆయన 2014లో బ్లడ్ డొనేషన్ పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించేందుకు రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా చేరారు. ఆ తరువాత అనేక బ్లడ్ బ్యాంకుల్లో పని చేశారు. కొన్నాళ్ల కిందట వందేభారత్ బ్లడ్‌బ్యాంక్ ప్రారంభించి స్వయంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 1,060 రక్తదాన శిబిరాలు నిర్వహించి సుమారు 60 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి ఎంతో మంది ప్రాణాలు కాపాడారు. వేలాది యూనిట్లు సేకరించి ఆయన వైజాగ్ బ్లడ్ మ్యాన్‌గా పేరు తెచ్చుకున్నారు. ఇప్పటి వరకు వినోద్ బాలు స్వయంగా 35 సార్లు రక్తదానం చేశారు. అత్యంత అరుదైన బి నెగిటివ్ బ్లడ్ గ్రూప్ కావడంతో ఎంతో మంది క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా, రక్తదానం చేసి ప్రాణాలు నిలబెట్టారు. వినోద్ బాలు సేవలకుగాను గాజువాక కోర్టు లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ (లోక్ అదాలత్ సోషల్ వర్కర్)గా నియమితులయ్యారు. అలాగే, అఖిల భారత శరీర, అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ అవయవదానంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

127 సార్లు రక్తదానం చేసిన వంకాయల జవహర్



నగర పరిధిలోని వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వంకాయల జవహర్ ఇప్పటి వరకు 127 సార్లు రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడారు. తొలిసారి ఓ కానిస్టేబుల్ భార్య ప్రాణాపాయ స్థితిలో ఉండగా రక్తదానం చేశారు. అప్పటి నుంచి రక్తదానం చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇతరులకు ప్రేరణ కల్పిస్తూ ఇంతవరకు 1,500 మందితో రక్తదానం చేయించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఆఫీసర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. అవయవ దానం చేయాలని అర్థాంగితో కలిసి ఆయన నిర్ణయించుకున్నారు. నేత్రదానానికి ఆయన పిల్లలను ప్రోత్సహించారు. ఇప్పటి వరకు 60కుపైగా అవగాహన శిబిరాలు నిర్వహించి వందల యూనిట్ల రక్తాన్ని సేకరించి అనేక బ్లడ్ బ్యాంకులకు అందించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా రక్తం కావాలని ఫోన్ చేస్తే సిద్ధంగా ఉండడంతోపాటు మరింత మందిని తీసుకెళ్లి వారి ప్రాణాలను కాపాడడంలో ముందుంటారు.

క్రైం... crime news

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 42 ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించారని డీఎస్పీ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్. వెనుక వరుసలో నిందితులు

సబ్బవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పలు మండలాల్లో గత రెండేళ్లుగా ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన 42 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను శుక్రవారం సబ్బవరం పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలు ఉన్నారు. దీనికి సంబంధించి పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విశాఖపట్నం మర్రిపాలేనికి చెందిన గరికిపాటి సాయికిరణ్, పట్నాల రాజేశ్వరరావు, మహరాణిపేటకు చెందిన నెల్ల సాయిప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు 2023 నవంబరు నుంచి 2025 జూన్ వరకూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని సబ్బవరం, ఆనందపురం, పెందుర్తి, అచ్యుతాపురం, చోడవరం, కశింకోట, యలమంచిలి, భీమిలి మండలాల్లో ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. అప్పటి నుంచి ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. 8 మండలాల్లో 42 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయగా, ఇందులో అత్యధికంగా సబ్బవరం మండలంలో 15 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. నిందితులు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే కాపర్ వైర్‌ను తీసి అమ్మేసేవారన్నారు. ఈ విధంగా 190 కిలోల కాపర్ తీగను అమ్మేశారన్నారు. దీనిని రికవరీ చేశామని ఆయన తెలిపారు. ఈ కేసుల్లో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐలు పి.సింహాచలం, దివ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పెందుర్తిలో నకిలీ పోలీసుల అరెస్ట్



నిందితులు శివప్రసాద్, గోపి

పెందుర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు యూనిఫాం ధరించి రాత్రిపూట పలు ప్రాంతాల్లో మాటువేసి ద్విచక్రవాహనంపై తిరిగే ప్రేమజంటలను అడ్డగించి కేసు పెడతామని బెదిరించి డిజిటల్ లావాదేవీలతో నగదు లాక్కుంటున్న ఇద్దరు హైటెక్ నకిలీ పోలీసులను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి స్కూటీ, రూ.2 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు ఏపీఎస్పీ బెటాలియన్ మాజీ కానిస్టేబుల్ అని సీఐ కేవీ సతీశ్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. ఈతలపాక శివప్రసాద్ (37) గతంలో ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కానిస్టేబుల్‌గా పనిచేసి అనుచిత ప్రవర్తన కారణంగా 2019లో విధుల్లోంచి తొలగించారు. ఈక్రమంలో ఇతడు పోలీసు దుస్తులు ధరించి నకిలీ పోలీసు అవతారం ఎత్తాడు. విశాఖ నగర శివారు ప్రాంతాల్లో స్కూటీపై మాటువేసి ప్రేమజంటలను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడేవాడు. తనిఖీల పేరిట బైక్‌లు అడ్డగించి కేసు పెడతానని బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడు. పెదగంట్యాడ స్నేహపురి కాలనీకి చెందిన కోరాడ జయరాం తనకు కాబోయే భార్యతో కలసి ఈ నెల 6న రాత్రి అడివివరం మీదుగా బైక్‌పై విజయనగరం వెళుతుండగా ఎస్ఆర్‌పురం దారిలో వారిని బెదిరించి రూ.5 వేలు నగదు బదిలీ చేయించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సరిపల్లిలో ఇదే తరహాలో దోపిడీకి పాల్పడుతుండగా నిందితులను పట్టుకున్నారు. పాత నేరస్థుడైన ఇతనిపై నగరంలోని పలు స్టేషన్లలో తొమ్మిది కేసులు ఉన్నాయని సీఐ వివరించారు.

మంటలకు కారు ఆహుతి



అక్కిరెడ్డిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద శుక్రవారం రాత్రి కారు అగ్నికి ఆహుతయ్యింది. ఉమ్మలాడకు చెందిన ఎల్ఎస్ ప్రభాకర్ శుక్రవారం రాత్రి తన కుమార్తెతో ఎస్‌ఏడీలో ఉన్న తన అత్తవారి ఇంటి నుంచి కారులో ఇంటికి వస్తుండగా 7 గంటల సమయంలో షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి కారు ఆగిపోయింది. కారు స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా ఇంజన్ నుంచి పొగలు రావడాన్ని ఇతర వాహనదారులు గుర్తించి ప్రభాకర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో వెంటనే ప్రభాకర్ తన కుమార్తె, సామాన్లతో పాటు కారు కాగితాలు తీసుకుని బయటకు వచ్చేశారు. అప్పటికే కారు ఇంజన్ నుంచి వచ్చిన మంటలు మొత్తం వ్యాపించాయి. దీంతో అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసేలోపు కారు పూర్తిగా తగలబడిపోయింది. కొన్న మూడేళ్లకే తన కారు అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రాణాలతో బయట పడినందుకు ఊరట చెందారు.

వైద్య కళాశాలకు యాచకుడి మృతదేహం అప్పగింత



మృతదేహాన్ని అప్పగిస్తున్న సీఐ జేడీ బాబు

మహారాణిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమానాలు లేని మృతదేహాలను వైద్య కళాశాలకు అప్పగిస్తే విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడుతుందని వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు అన్నారు. శుక్రవారం పూర్ణామార్కెట్ పరిసరాల్లో యాచకుడి మృతదేహం ఉందన్న సమాచారంతో అక్కడకు వెళ్లి పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించి పోలీసు కమిషనర్ బాగ్చి దృష్టికి తీసుకెళ్లారు. సీపీ ఆదేశాలు, ఏఎంసీ ప్రిన్సిపాల్ విజ్ఞప్తి మేరకు లడ్డు వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మృతదేహాన్ని అనాటమీ విభాగానికి అప్పగించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న తమిళనాడుకు చెందిన సెల్వన్‌ను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.90 వేల విలువైన 18 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నా రు. శుక్రవారం ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు చేస్తున్న సమయంలో నిందితుడు తిర్పూర్‌కు గంజాయిని రవాణా చేస్తూ చిక్కాడని, అతడిని కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చిత్రంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, సీపీ బాగ్చి, కేంద్ర ఆయుష్ విభాగం ఉన్నతాధికారులు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖను జాతీయ ఆతిథ్య నగరంగా ఎంపిక చేసిన నేపథ్యంలో ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ఆయుష్ కార్యదర్శి వైద్యా రాజేష్ కోటిచా, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, కేంద్ర ఆయుష్ సంయుక్త కార్యదర్శి మోనాలిసా దాస్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తదితరులు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. రుషికొండ, గీతం విశ్వ విద్యాలయం, ఆర్కేబీచ్ వంటి ప్రధాన వేదికల ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్ ప్రాంగణంలోని సాగరిక హాలులో సమీక్ష నిర్వహించారు. 21న యోగా ప్రదర్శనతోపాటు సాంస్కృతిక, విద్యా, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉన్నతాధికారుల బృందానికి జిల్లా అధికారులు వివరించారు. శాఖల మధ్య సమన్వయం, భద్రత, వసతులు, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. 'చివరి వ్యక్తి వరకు యోగాను తీసుకెళ్లాలి' అన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు యోగా ఉద్యమం ఊపందుకుంటుందని కేంద్ర ఆయుష్ కార్యదర్శి వైద్యా రాజేష్ కోటిచా తెలిపారు. యోగా దినోత్సవానికి చురుగ్గా చేపడుతున్న ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. యోగాపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని అభినందించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ 'యోగాంధ్ర' అనే వినూత్న ప్రణాళికను ఏపీ ప్రభుత్వం చేపట్టిందని, ఇందుకోసం రాష్ట్రంలో రెండుకోట్ల మంది పౌరులకు యోగా సాధన చేరాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఐదు లక్షల మందితో యోగా దినోత్సవం జరగడానికి వీలుగా నగరంలో అనేకచోట్ల యోగా సాధన ముమ్మరంగా సాగుతోందన్నారు. సమీక్షలో నగర పోలీసు కమిషనర్ డాక్టరు శంఖబ్రత బాగ్చి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు నైతికత అవసరం

- సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు



జస్టిస్ లావు నాగేశ్వరరావును సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు, ఇతర ప్రముఖులు

సబ్బవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తిలో రాణించేందుకు న్యాయవాదులకు నైతికతతో పాటు సమగ్రత అవసరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో బార్ కౌన్సిల్ సమావేశం రెండో రోజైన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే సహనం, కృషి ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత పరిస్థితులలో మధ్యవర్తిత్వానికి పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా న్యాయవాదులు, న్యాయమూర్తులకు శిక్షణ ఉండాలన్నారు. అనంతరం జస్టిస్ నాగేశ్వరరావును వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సిరపరపు కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ (ఏపీ) అల్లూరి రామిరెడ్డి, ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, రాష్ట్ర బార్ కౌన్సిల్ విశాఖపట్నం సభ్యులు వి.నరసింగరావు, గంటా రామారావు, కీర్తి రామజోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు 550 ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నగరంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి విశాఖ రీజియన్ నుంచి 550 ప్రత్యేక బస్సులు వినియోగించనున్నారు. రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తాయి. యోగాంధ్రలో పాల్గొనేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇలాంటి వారిని సంబంధిత యోగాంధ్ర కో-ఆర్డినేటర్లు గుర్తించి ప్రత్యేక బస్సుల ద్వారా నిర్దేశిత స్థలానికి తరలిస్తారు. మధురవాడ, వాల్తేరు, మద్దిలపాలెం, గాజువాక, సింహాచలం, స్టీల్‌సిటీ డిపోల పరిధిలోనివారిని ఆయా డిపో బస్సులు తరలిస్తాయని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. రామకృష్ణా బీచ్ నుంచి భీమిలి వరకు ఈ యోగాంధ్రకు స్థలాన్ని నిర్దేశించారు. అన్ని ప్రాంతాల వారిని యోగాంధ్ర స్థలానికి తరలించేందుకు నిర్ణయించి ఆ మేరకు ఈ నెల 20 అర్ధరాత్రినుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్ ఎం తెలిపారు.

అవగాహనతోనే క్యాన్సర్ నివారణ

- కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇసుకపల్లి వాణి



క్యాన్సర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇసుకపల్లి వాణి

బీచ్ రోడ్డు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే క్యాన్సర్ నివారణ సాధ్యమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇసుకపల్లి వాణి పేర్కొన్నారు. శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో కాంక్వర్ హెచ్‌పీవీ అండ్ క్యాన్సర్ కాన్‌క్లేవ్-2025 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. క్యాన్సర్‌పై అపోహలు తొలగించుకొని అప్రమత్తంగా ఉంటే నివారణ సులువన్నారు. ఆసుపత్రులలో అత్యాధునిక చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్యవిద్యా బోధనలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకోవాలని సూచించారు. ఇందులో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకొని ఆ జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. హెచ్‌పీవీ కేవలం గర్భాశయ క్యాన్సర్‌కు మాత్రమే పరిమితం కాదని వాణి అన్నారు. దీనికి వల్వా, యోని, పాయువు, పురుషాంగం, ఒరోఫారింక్స్ క్యాన్సర్లతో కూడా సంబంధం ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యాధి పురుషులు, స్త్రీలను ప్రభావితం చేస్తుందని చెప్పారు. 15 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్య హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్ గరిష్ఠంగా ఉన్నందున ముందస్తు అవగాహన అవసరమన్నారు. సకాలంలో నివారణ చర్యలు తెలుసుకొని అందుబాటులో ఉన్న వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నుంచి అనుమానితులను రక్షించడం సులభమవుతుందన్నారు. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరాగ్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద వ్యాక్సిన్ తయారీదారు భారతదేశంలో ప్రజారోగ్యాన్ని అభివృద్ధి చేయడంలో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కీలకపాత్ర పోషిస్తుందన్నారు. మనదేశంలో మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ వైద్యులు డాక్టర్ రెడ్డ విద్యా రామ, గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ సునందరాణి గుప్తా, చీఫ్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ నిఖితా హాస్పటల్, డా.సాయి సునీల్ కిషోర్ మానెమ్, డా.బుద్ధ మురళి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.